నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబ్‌నగర్
శనివారం | జూలై 06. 2024 | www.navatelangana.com
1

జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

జిల్లా పరిషత్ పాలకవర్గాలకు గురువారంతో గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ సీఈవో రాఘవేంద్రరావు సిబ్బంది ఆమె స్వాగతం పలికారు. తిరిగి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేవరకు ప్రత్యేక అధికారిగా కొనసాగడం జరుగుతుందని ఆమె తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-గండీడ్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాల బారిన పడ కుండా ప్రజలు ఉంటారని గండీడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్య పరీక్ష నిర్వహించి అనంతరం మెడికల్‌ఆఫీసర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ.సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డెంగ్యూ, మలేరియా, దోమ కాటు, నివారణ ఈగల బారిన పడకుండా ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది,రోగులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలను పునఃప్రతిష్టించాలి

- మున్సిపల్ చైర్మన్ కు సిజే బెనహర్ వినతి



నవ తెలంగాణ మహబూబ్ నగర్

మహబూబ్‌నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మహనీయుల విగ్రహాలను రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గతంలో తీసివేశారని, వాటిని మళ్లీ పున ప్రతిష్టించాలని కోరుతూ డీసీసీ మీడియా సెల్ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ సీజే బెనహర్ శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధులు సుభాష్ చంద్ర బోస్, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి. వైఎస్ రాజశేఖరరెడ్డి. నందమూరి తారకరామారావు విగ్రహాలను తీసివేశారనీ, ఆ విగ్రహాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదని పేర్కొన్నారు. మీరు ప్రత్యేక దృష్టి సారించి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆ విగ్రహాలను పట్టణంలోని ప్రధాన స్థలాల్లో పునఃప్రతిష్టించాలని విజ్ఞప్తి చేశారు. దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఈనెల 8వ తేదీన ఉందని, అంతలోపే ఆయన విగ్రహాన్ని గతంలో తీసివేసిన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చౌరస్తాలో ఏర్పాటు చేయాలని కోరారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా తన హయాంలో ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి ఈ ప్రాంతానికి నీళ్లను అందించినట్లు గుర్తు చేశారు. వైయస్సార్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని, ఆయన జయంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు...

ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు

- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసిన వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోబడుతాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాలమేరకు ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం మహబూబ్ నగర్‌టౌన్‌లో తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకొని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు తెలియజేయునది కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే. వినియోగించు కోవాలన్నారు. ఎవరైన వాహన దారుడు సైలెన్సర్ మార్పు చేసే వారిపై పోలీసులు క్రిమినల్ చర్యలు తీసుకో బడటంతో పాటు అట్టి వాహనదారులకు ఆర్టీఐ ద్వారా 03 నెలలు లైసెన్సు రద్దు చేసి అ వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.అలాగే తమ మెకా నిక్షలు కూడా ఎట్టి పరిస్థితిలో ద్విచక్రవాహనాలకు సైలెన్సర్ల మార్పుకు ప్రోత్సహి ంచవద్దన్నారు. ఇకపైన సైలెన్సర్ల మార్పుకు సహకరించిన మెకానిక్లపై క్రిమినల్ చర్యలు: తీసుకోబడుతాయని తెలిపారు.

విద్యార్థుల దశ మార్చే సామర్థ్యం ఒక్క ఉపాధ్యాయులే

- రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి ఎల్. వి. సుబ్రహ్మణ్యం



నవతెలంగాణ - మహబూబ్‌నగర్

విద్యార్థుల దశ మార్చే సామర్థ్యం ఒక ఉపాధ్యాయులకే ఉంటుందని అందుకే గురువులకు ఆ గౌరవం ఉంటుందని మాజీ ఐఏఎస్ అధికారి ఎల్. వి. సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో గ్రామీణ భాగస్వామి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినీలకు అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని తెలుగు మీడియంలో చదివిన 19 మంది విద్యార్థినిలకు అవార్డులు తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.జిల్లాలోని 17 మండలాలకు చెందిన 19 విధ్యార్థినిలకు పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినిలకు తల్లిదండ్రులకు నగదు బహుమతితో పాటు పసుపు, కుంకుమతో కూడిన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సమాజంలో వస్తున్న మార్పులన్నింటికీ ప్రధాన కారణం ఉపాధ్యాయులేనని గుర్తుచేశారు.ఉపాధ్యాయులు తలచుకుంటే విద్యార్థి, దశను మార్చగల సామార్థ్యం వారికే ఉందన్నారు. అందుకే నాకు ఉపాధ్యాయులంటే ఎనలేని గౌరం ఉందన్నారు. పుట్టుకతోనోతే ఆస్తులు అంతస్తులు లేకపోయినా పుట్టుకతోనే తెలివితేటలు వెంటవస్తాయని తెలిపారు.ఆ తెలివితేటలను సరైన పద్దతిలో వాడుకుంటే పైకి వస్తారని, లేకుంటే అక్కడే ఉండి పోతారని ఆయన అన్నారు. బాలికలకు ఇస్తున్న ఈ ప్రోత్సాహక అవార్డులు మహిళా జాతి అభ్యున్నతికి ఇస్తున్న అవార్డుగా తాను భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ధర్మాన్ని నిలబెట్టాలని, ధర్మం అంటే మతం కాదని, ధర్మం వేరు మతం వేరని, దార్మికమైన సమాజం కోసం ఉపయోగపడేదే ధర్మమని ఎల్.వి. సుబ్రహ్మణ్యం అన్నారు. విద్యార్థులు తాము చదివే చదువులతో పాటు అనేక అంశాలపై ఆసక్తిని పెంచు కోవాలన్నారు. 1990 -1992 సంవత్సరాలు మధ్య తాను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా కొనసాగానని ఆ సమయంలో అక్షర కిరణం పేరిట రాత్రివేళల్లో గ్రామాల్లో తిరుగుతూ వయోజన విద్యపై అవగాహన కల్పించారు.గ్రామీణ భాగస్వామ్య సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేందర్ స్వామి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో కలుపుకుని ఈ విద్యా సంవత్సరానికిగాను 52 మంది విద్యార్థినిలకు ప్రోత్సాహక అవార్డులు అందించామన్నారు.. 2016 నుంచి 2024 వరకు ఇప్పటి వరకు మొత్తంగా 201 మంది విద్యార్థినీలకు ఈ అవార్డుల ప్రధానోత్సవం చెయ్యడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్ మధుసూధన్ రెడ్డి, గ్రామీణ భాగస్వామ్య సంస్థ (వి.ఐ.పి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేందర్ స్వామి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ టీకేఎస్ శర్మ, విద్యార్థినిల తల్లిదండ్రులు, గ్రామాల మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు లు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాలలో

తోళ్ల పరిశ్రమకు చెదలు

- పదేళ్లుగా ముందుకు సాగని పనులు
- వృత్తి దారులకు చేయూత అంటూ... చర్మకారులను మరిచారు
- 2002 నుంచి తోళ్ల పరిశ్రమపై వివక్ష
- ఆందోళనలో దళిత యువత

దశాబ్దాలు గడిచినా.. దళితుల బతుకులు మారడం లేదు. దళిత యువతకు నైపుణ్యం కల్గించి ఉపాధికల్పించే ఉద్దేశంతో లేదర్‌పార్కు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన తోళ్ల పరిశ్రమ నిర్మాణ పనులు తెలంగాణ రాష్ట్రంలో చెదలు పడుతున్నాయి.చర్మకారుల వృత్తి నైపుణ్యంతో పాటు ఉపాధి లభించే ఈ పరిశ్రమల కోసం ఒకదానికి 25 ఎకరాలకు భూమిని సేకరించి భవనాలు నిర్మించారు. దశాబ్దం కాలం నాడు నిర్మాణం చేసిన ఈ పరిశ్రమలు నిర్వహణ లేక మూత పడ్డాయి.



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

మంచిర్యాల జిల్లా మందమర్రిలో 25 ఎకరాలతో తోళ్ల పరిశ్రమ కోసం చక్కని భవనం నిర్మించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 25ఎకరాలతో జనగాం స్టేషన్ ఘనపూర్ దగ్గర 25ఎకరాలతో ఖమ్మం జిల్లా కొమ్మపల్లి 25 ఎకరాలు, మల్లెమడుగులో 25 ఎకరాలు, నల్లగొండ జిల్లా దండిపల్లిలో25 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లా జింకుంటలో 25 ఎకరాలు, మహబూబ్‌నగర్ జిల్లా పోలెపల్లి సెజ్ దగ్గర 25 ఎకరాలు,నిజమాబాద్ జిల్లా ఆర్మూర్ దగ్గర 28 ఎకరాలు, కరీంనగర్ జిల్లా రుక్మా పూర్‌లో 40 ఎకరాలు, ఖమ్మం జిల్లా మధిరలో 25 ఎకరాలు, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో 25 ఎకరాలలో ఒక భవనాలలను నిర్మించారు. ఇప్పుడీ పరిశ్రమలన్నీ దాదాపు మూత పడ్డాయి. 2014లో అధికారంలో వచ్చిన బీఆర్ఎస్ వృత్తులకు చేయూత ఇస్తామని ప్రకటించారు.కుమ్మరి, కమ్మరి, చాకలి వంటి అత్యంత వెనకబడిన వారితో పాటు దళిత సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు దళిత సామాజిక వర్గానికి చెందిన వారికోసం ఇప్పటి వరకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా నయాపైసా కూడా ఖర్చు పెట్టలేదు. పెట్టినా... అరకొర మాత్రమేనని తెలిపారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2.25 లక్షల మంది దళితులు ఉన్నారు. ప్రధానంగా దళిత సామాజిక వర్గానికి చెందిన వారు నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా ఉన్నారు. అందుకే ఇక్కడ ఒక ఎంపీ ఒక ఎమ్మెల్యే స్థానాలను ఎస్సీలకు రిజర్వు చేశారు. ఇక్కడ పీజీ ఉన్నత చదువులు చదివిన యువకులు 10వేలు, డిగ్రీ పూర్తిచేసిన వారు 15 వేలు, ఇంటర్ పూర్తి చేసిన వారు 20 వేల మంది ఉంటారు. వీరంతా ఉద్యోగాలు లేక ఉపాధి కరువై వీధుల్లో తిరుగుతున్నారు.వీరిలో దాగిఉన్న నైపుణ్యత పెంచడానికి తెలంగాణలో లెదర్ పార్కులను ఏర్పాటు చేసి శిక్షణతో పాటు ఉపాధి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించారు. 2022లో లెదర్‌పార్కులను ఏర్పాటు చేయడంతో దళితులకు ఉపాధి లభిస్తోందని ఉమ్మడి రాష్ట్రంలో ప్రకటించారు.తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కులవృత్తులను నమ్ముకొని జీవిస్తున్న వారికి నైపుణ్యంతో పాటు బరోసా ఉంటుందని ఆశించారు. కానీ ఆశించిన లెదర్ పార్కుకు ఆదిలోనే ఆగిపోయింది. రెండు దశాబ్దాలైనా ఇక్కడ లెదర్ పార్కులో శిక్షణ మొదలు కాలేదు. రూ. 25లక్షలు ఖర్చు ఒక్కో లెదర్‌పార్కుకు భవనాలను నిర్మించారు. అందులో శిక్షణ ఏర్పాటు కోసం మరో 50 లక్షలు పెట్టి యాంత్రాలు ఏర్పాటు చేశారు. రెండు బ్యాచ్‌లను చెన్నైకి పంపి అక్కడ కుట్టుమిషన్‌లపై అవగహన కల్పించారు. శిక్షణ పొందిన వారు బ్యాగులు, లెదర్ వస్తువుల తయారిసంస్థలో శిక్షణ పొందిన వారిలో కొందిరికి ఉపాధి లభించింది. ఆతర్వాత నిర్వహణ మరిచి పోవడంతో ఇక్కడ శిక్షణ నిలిచి పోయింది. ముఖ్యంగా రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి ఆతర్వాత పార్కులను మూసేశారు. వేలాది మందికి ఉపాధి ఏమో కాని ఇప్పుడు అక్కడ కనీసం ఆస్తులను కాపాడుకోలేని దుస్థితి నెలకొన్నది. మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా జింకుంట దగ్గర 2003లో లెదర్‌పార్కు మొదలైనా శిక్షణ లేక పార్కులు మూతపడ్డాయి. తెలంగాణలో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వమైనా కుల వృత్తులను దృష్టిలో పెట్టుకొని లేదర్‌పార్కులను అభివృద్ధిలోకి తెస్తుందనుకున్నాం. కానీ 10 ఏళ్ల కాలంలో లెదర్‌పార్కుల విషయంలో నయా పైసా ఖర్చు పెట్టలేదని పలువురు ఆరోపించారు.ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం దళిత సామాజిక వర్గ అభివృద్ధికోసం లెదర్‌పార్కుల నిర్వహణకు నిధులు కెటాయించి దళితులకు ఉపాధి కల్పించాలని కోరారు.

దళితులు ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

దళితులు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా నైపుణ్యతను పెంచుకోని చిన్న పరిశ్రమలను స్థాపించడం ద్వారా వృద్ధిలోకి రావాలి.

రామ్‌లాల్, ఇడి, ఎస్సీ కార్పోరేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా

మేమెలా బతకాలి

మాకు లెదర్ పార్కు ద్వారా ఉపాధి లభిస్తే.. కంపెనీలో ఉద్యోగాలు వస్తాయి. రెండు దశాబ్దాలుగా లెదర్ పార్కు మూత పడింది. దాన్ని తెరిపించి మాకు శిక్ష ఇప్పిస్తే..బాట షూస్, టాటా వంటి కంపెనీలో ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తున్నాను.

భాస్కర్ గాలిగూటి, నడిగడ్డ నాగర్‌కర్నూల్

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి : కలెక్టర్



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిఅన్నారు.శుక్రవారం" డ్రై డే" కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ పట్టణం లోనిజగ్జీవన్ రాం నగర్ లో డ్రైన్ లను, ఇంటింటా పరిసరాలను పరిశీలించారు. డ్రైన్ లు మురుగు నీరు ప్రవహించేలా పరిశుభ్రం చేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దోమల వృద్ధి చెందకుండా పాగింగ్ ,స్ప్రే నివారణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ప్రజలు ఇంటి ఆవరణ లో చెత్త చెదారం రోడ్లపై వేయ వద్దని సూచించారు. మున్సిపల్ చెత్త సేకరణ ఆటో వాహనం వస్తున్నాధా నివాసితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లలో ఉన్న కూలర్లు, పూల కుండీలు , టైర్లు కొబ్బరి బోండాలు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు.కమ్యూనిటీ హాల్ ను పరిశీలించారు.కమ్యూనిటీ హాల్ లో లైటింగ్,డోర్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ శానిటేషన్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రం అభివృద్ధే లక్ష్యం

- నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కృషి
- జూపల్లి కృష్ణారావు దామోదర రాజేంద్రసింహ మంత్రులు
- పర్యాటక రంగం అభివృద్ధితోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ.

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పులులు, శైవ క్షేత్రాలు, జలపాతాలకు నిలయమైన నల్లమల అటవీ ప్రాంతాన్ని దేశ, విదేశాల పర్యాటకులను రప్పించే దిశగా నల్లమల్లలో ఎకో టూరిజం హబ్ గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో టూరిజాన్ని అభివృద్ధి చేసి రాష్ట్ర ఆర్థిక వనరులను పెంపొందించనున్నట్లు మంత్రులు దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల్లలో పర్యాటకరంగం అభివృద్ధి కోసం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని రంగాపూర్ గ్రామంలోని ఉమామహేశ్వర దేవస్థానాన్ని, నిరంజన్ షావలి దర్గాను సందర్శించి దర్శించుకున్నారు.అనంతరం అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ గ్రామ శివారు చింతల చెరువు వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు 75 వన మహోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలసి 350 మొక్కలు నాటారు.తదనంతరం నల్లమల్ల అటవీ ప్రాంతంలోని బౌరాపూర్ పెంట వరకు జంగల్ సఫారీ వాహనంలో మంత్రులు ఎమ్మెల్యేల అధ్యయన బృందం పర్యటించి, నల్లమల అటవీ ప్రాంతంలో పలు పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు.ఫరహాబాద్ వ్యూపాయింట్‌ను బృందం సభ్యులు సందర్శించారు. అక్కడే పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... నల్లమల్ల అటవీ ప్రాంతంలో అందమైన ,అత్యంత రమణీయమైన పర్యాటక వనరులు ఉన్నాయని, దేశ విదేశాల పర్యాటకులను నల్లమల్ల ప్రాంతంలో సందర్శించే విధంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి నల్లమల్లప్రాంతం ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిసే విధంగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చెందేలా ప్రతి జిల్లాలో ప్రతినెలలో సందర్శించి పర్యాటక రంగం కేంద్ర బిందువుగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ కర్తవ్యమని మంత్రి చెప్పారు. టూరిజం అభివృద్ధితోపాటు తెలంగాణ నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునే దిశగా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కొన్ని దేశాల్లో వనరులు లేకపోయినప్పటికీ పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగానికి అత్యధిక వనరులు ఉన్నాయని, వాటిని ఈ రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకొని పర్యాటక రంగాన్ని మరింతగా బలోపేతం చేసే దిశగా కృషి చేసేందుకే నేడు నల్లమల్లలు స్టడీ టూర్ ను నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.తెలంగాణ రాష్ట్రంలో అత్యంత పురాతన సంపద, కళలు ఉన్నాయని తెలిపారు. వాటిని ఆ దిశగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న తపనతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. పురాతన కట్టడాలు,కొండలు,గుట్టలు,పురాతన గొప్ప దేవాలయాలు, పురాతన కళా సంపద ఉన్నాయని ,పర్యాటకులను రప్పించే ప్రదేశాలు చాలా ఉన్నాయని,పర్యాటక ప్రాంతాల ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, లభిస్తాయని తద్వారా రాష్ట్రానికి ఆదాయం కూడా సమకూరుతుందని తెలిపారు.ఫారెస్ట్ శాఖలు సంయుక్తంగా పీపీపీ పద్ధతి ద్వారా పర్యాటకంగా ఆదాయం పెంచే కార్యాచరణ రూపొందించ నున్నట్లు తెలిపారు.అడవులను సంరక్షిస్తూ,అడవులలోని అందాలను ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించే విధంగా ఆయా ప్రదేశాలను అభివృద్ధిని చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ....నల్లమల్ల ప్రాంతంలో అడవులను పచ్చదనాన్ని కాపాడుతూనే తెలంగాణ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే మా సంకల్పమని మంత్రి తెలిపారు.పచ్చదనంతో ప్రసిద్ధి గాంచిన నల్లమల్లను టూరిజం హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉందని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక రంగం అభివృద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మంత్రుల ఎమ్మెల్యేల బృందం నల్లమల్ల అటవీ ప్రాంతంలో ప్రదేశాలను సందర్శించినట్లు, నల్లమల్ల అడవి ప్రాంతంలో గల బౌరాపూర్ టెంపుల్, పరహాబాద్ లో వ్యూ పాయింట్ ప్రకృతి ప్రేమికులకు చాలా ఆనందాన్నిస్తుందని తెలిపారు. ఇలాంటి ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు నల్లమల్ల ప్రాంతంలో అనేకంగా ఉన్నాయని, కావున నల్లమల్ల అడవి ప్రాంతం టూరిజం హబ్‌గా, టూరిజం డెస్టినేషన్ గా ఉండబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, వాకిటి శ్రీహరి, డా. రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్ఎం. డోబ్రియల్, పర్యాటక పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోళికేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇల త్రిపాఠి, కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, డీఎఫ్వో రోహిత్, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు .



సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో తప్పిదాలను సవరించాలి

నవ తెలంగాణ మహబూబ్ నగర్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో జరిగిన తప్పిదాలను సవరించకపోతే ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉపాధ్యాయ పోరాట సంఘం కమిటీ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేష్, కె.రవికుమార్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఆదిత్య,ఎస్.వెంకటేశ్వర్లు,టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మహమూద్,నవీన్ కుమార్ లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలుగు పండిట్ లకు ఇచ్చిన అప్గ్రేడ్ పదోన్నతి లో ఒక వికలాంగ ఉపాధ్యాయురాలి కి అన్యాయంగా పదోన్నతి రాకుండా చేశారని తెలిపారు. లిస్ట్ తయారీలో కూడా అవకతవకలు జరిగాయని మిగిలి పోయిన గ్రేడ్ 2 పండితులకు బదిలీలకు సంబంధించి ఖాళీలను చూయించడంలో కూడా అవకతవకలు జరిగాయని తెలిపారు. భార్యాభర్తలు ఒకే దగ్గర పోస్టింగ్ తీసుకోవాలని నిబంధనలు పాటించకుండా వాటిని తుంగలో తొక్కి స్పౌజ్ వినియోగంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని డిమాండ్ చేశారు.నష్టపోయిన వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.డీఈఓ గారిని ఎన్నిసార్లు అడిగినా స్పందించలేదని వారు అన్నారు. బదిలీ కాబడిన ఎస్‌జిటి ఉపాధ్యాయులు నేటికీ 70శాతం మంది ఉపాధ్యాయులు రిలీవ్ కాలేదన్నారు. బదిలీ కాబడిన ప్రతి ఎస్జీటీ ఉపాధ్యాయుడిని రిలీవ్ చేసి కొత్త పాఠశాలలలో చేరే టట్లుగా డీఈవో ఆదేశాలు ఇవ్వాలని కోరారు.అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే, బాధితులకు తగు న్యాయం జరగకపోతే ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఒక ప్రకటనలో తెలిపారు

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి: డీఐఈఓ



మహబూబ్ నగర్ : ప్రతి సం. జులై మాసంలో నిర్వహించే వన మహో త్సవంలో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా. శ్రీధర్ సుమన్ అన్నారు. మహ బూబ్ నగర్ జిల్లా ఇంటర్ విద్య కార్యాలయం, బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం "వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా. శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న 15 జూనియయర్ కళాశాలల్లో 2500 పైగా మొక్కలు నాటడానికి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులతో పాటు వన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ప్రతీ సం. జులై మాసంలో నిర్వహించే వన మహొత్సవంలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడాన్ని ఒక పవిత్ర కార్యంగా చేపట్టాలని అన్నారు. కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది మొక్కలను నాటడమే కాకుండా ప్రతీ రోజు వాటికి నీరందించి ఎదిగే వరకు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్ జహా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది సందీప్, సాధిక్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ- హన్వాడ

మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ గ్రామంలో గంగ్రాపాడు ఆంజనేయ స్వామి గుడి దగ్గర శుక్రవారం ఇబ్రహీంబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేట సత్యారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యె న్నం శ్రీనివాస్ రెడ్డి ,సీడీపీ నిధు లు 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను మంజూరు చేశారని అన్నారు. దేవాలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారని తెలిపారు. సీసీ రోడ్డును నాణ్యతతో వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎర్ర ఆంజనేయులు, జోగువాసు, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి,ఖాతాల్ కృష్ణయ్య ,స్వరూపరెడ్డి యాదయ్య, వెంకట్ రాములు, మల్లేష్ ,మాసయ్య పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వనపర్తి
2
శనివారం | జూలై 6, 2024 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి పోటీలకు కల్వరాల విద్యార్థినులు



నవ తెలంగాణ-వీపనగండ్ల

హైదరాబాదులో గోపీచంద్ అకాడమీలో ఈనెల 7వ తేదీన నిర్వహించే అథ్లెటిక్ కిడ్స్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలకు వీపనగండ్ల మండలం కల్వరాల జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజావర్ధన్ చారి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన వనపర్తిలోతని బాల కృష్ణయ్య క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థినులు సి.మీనాక్షి, జి మీనాక్షి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జెడ్పీ ప్రత్యేకారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ- వనపర్తి



జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ గడువు నెల 4వ తేదీతో ముగియడంతో నిబంధనల ప్రకారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యే కాధికారిగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఛాంబర్‌లో జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి యాదయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జెడ్పీ కార్యాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. 2023-24 బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు, మిగిలిన బడ్జెట్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలి

- కలెక్టర్ కార్యాలయం ఎదుట వామపక్ష నాయకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

నవతెలంగాణ- వనపర్తి

శ్రావణపల్లి బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలంటూ శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ మాస్‌లైన్ పార్టీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, సీఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అడిషనల్ కలెక్టర్ నాగేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం.డి.జబ్బార్, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి హనుమంతు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మోస, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటల్లో పోటీ పడాలని నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. సింగరేణి సంస్థ శ్రావణపల్లిలో బొగ్గు తవ్వాలి కానీ వేలం పాట ద్వారా ప్రైవేటు సంస్థలకు అవకాశం ఇవ్వడం సరైంది కాదన్నారు. ఇప్పటికీ నాలుగు బ్లాకులను టీఆర్ఎస్ పాలనలోనే మోడీ ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పిందన్నారు. మన రాష్ట్రానికి చెందిన బొగ్గు గనుల శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలం ప్రక్రియను ప్రారంభించడం అన్యాయమన్నారు. మోడీ ప్రభుత్వం క్రమంగా సింగరేణి సంస్థ బలహీనపరిచి మూత పడేలా చేస్తుందన్నారు. ఈ ప్రయత్నాన్ని ప్రజలు అడ్డుకోవాలని అన్నారు. వేలం ప్రక్రియ ప్రారంభ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యకరమన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్ వేలం వెయ్యొద్దని తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్ష పార్టీలతో కలిసి ప్రధానిని కలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, మేకల ఆంజనేయులు, డి.బాల్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మండ్ల రాజు, రమేష్, పట్టణ కార్యదర్శి డి.కురుమయ్యమదన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం రాజు, జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎం.రమేష్,సూర్యవంశం రాము, గంధం మదన్, జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, ఎం చంద్రయ్య, సిపిఐ జిల్లా నాయకులు మోచ, గోపాలకృష్ణ, సిపిఐ మాస్ లైన్ జిల్లా నా యకులు ప్రసాద్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు శ్రీరామచంద్రుడు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ నాగేష్‌కు వినతి పత్రమిస్తున్న నాయకులు

వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచాలి

- వ్యాకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యాకాస నాయకులు

నవతెలంగాణ- వనపర్తి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యాకాస) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు నాటి ప్రభుత్వం కూలీ రేట్లు పెంచకుండ జీవో నెంబర్ 48ను సవరించకుండా, నిత్యవసర ధరలను పెంచి కూలీలను అడుక్కుతినేలా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పరిపాలన అమలుపరచాలంటే వ్యవసాయ కూలీలకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకనుగుణంగా జోన్లవారీగా కూలీరేట్లను పెంచుతూ తక్షణమే జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వ్యవసాయ కూలీలతో కలసి మండల, జిల్లా రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.అజయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.దేవన్న, జిల్లా కమిటీ సభ్యులు బి.రాజు పాల్గొన్నారు.

చేప పిల్లల టెండర్ల ప్రక్రియను పూర్తిచేయండి

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు

నవతెలంగాణ-వనపర్తి

ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ నియమించి నేరుగా సొసైటీ అకౌంట్లోకి నగదు బదిలీ చేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా చీఫ్ ప్రమోటర్ పుట్ట బాలరాజు రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌ను కోరారు. తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌గా బాధితులు చేపట్టిన ప్రియాంక ఆలను శుక్రవారం హైదరాబాద్‌లో పుట్ట బాలరాజు, ప్రమోటర్ సెంది శేఖర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మత్స్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులు మంజూరు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని, మరణించిన సభ్యుడి నామిని పాన్ కార్డు, ఆదాయ ధృవపత్రం రద్దు చేసి వ్యవసాయ రైతు లాగే ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం లేకుండా సొసైటీ తీర్మానం జిల్లా మత్స్య శాఖ కార్యాలయం రిపోర్టు ద్వారా ఇన్సూరెన్స్ మంజూరు చేయాలని కోరారు. ఈసందర్భంగా కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ ఉచిత చేప పిల్లల టెండర్ల ప్రక్రియ త్వరలో ప్రారంభ అవుతుందని, మిగతా విషయాలు పై అధికారులు తెలియజేస్తూ మరియు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి ఆంజనేయులు, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, తెలుగు గోపాల్, గద్వాల జిల్లా అధ్యక్షుడు, కాంత్ కుమార్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు గంజి ఆంజనేయులు , సంఘం ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పారిశుధ్య పనుల్లో జాప్యం ఉండొద్దు
- పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్
- పెబ్బేరు మండలంలో డ్రైడే పరిశీలన

నవతెలంగాణ-పెబ్బేరు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్య పనుల్లో జాప్యం ఉండొద్దని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా ఆయన పెబ్బేరు మున్సిపాలిటీ, మం డలంలోని గుమ్మడం, యాపర్ల గ్రామాల్లో పర్యటించారు. పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డ్‌లో శానిటేషన్ పనుల్ని కలెక్టర్ పరిశీలించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది అటెండన్స్ రికార్డులను పరిశీలించారు. ప్రత్యేకాధికారులు వారానికి రెండు సార్లు పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఇళ్ల పరిసరాలు పరిశీలించి పాత డబ్బాలు, కుండల్లో నిలువ ఉన్న నీటిని పారబోయాలని ఆదే శించా రు. పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ప్రజలకు డ్రైడే పై అవగా హన కల్పిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం గుమ్మడం, యాపర్ల గ్రామాల్లో డ్రై డేపై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు, పరిసరాలు ఎలా ఉన్నాయి అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాలు, మిద్దెల మీద, పాత టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, బాటిల్ యొక్క మూతలు వంటి వాటిలో వర్షపు నీరు చేరడం వల్ల వాటిలో దోమల వ్యాప్తి శరవేగంగా జరుగుతుందన్నారు. దోమల వల్ల ప్రాణాంతక డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని అందువల్ల నిలువ నీరు ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. డ్రై డే రోజున పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడి, ఆశ వర్కర్లను ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాలు పరిశీలించడమే కాకుండా ప్రజలకు డ్రైడే, దోమల వ్యాప్తి ఎలా జరుగుతుందో వివరిస్తూ మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రభలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ యాపర్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.



పెబ్బేరులో మురుగు కాలువలను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

పెబ్బేరు మండలం గుమ్మడం, యాపర్ల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఇళ్ల దగ్గర పరిశుభ్రత పాటించాలన్నారు. కలెక్టర్ జెడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి సురేష్, ఆర్డీవో పద్మావతి, అడిషనల్ డీఆర్డీఓ నాగేంద్ర, డిఎల్‌పిఓ రఘునాథ్, వనపర్తి మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు, మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి, వైస్ చైర్మన్ కర్రిస్వామి, కౌన్సిలర్ ఎల్లారెడ్డి ఉన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

- జిల్లా మలేరియా అధికారి కుమారస్వామి



నిలువ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ- మదనాపురం

ప్రస్తుత వర్షా కాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని జిల్లా సహాయ మలేరియా అధికారి కుమారస్వామి సూచించారు. మదనాపురం మండలం రామన్‌పాడ్ గ్రామంలో శుక్రవారం ఏఎల్‌వో టీం ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ఇండ్ల పరిసరాలను పరిశీలించి నీటి నిలువలను గుర్తించి పారబోశారు. అనంతరం మలేరియా అధికారి కుమారస్వామి మాట్లాడుతూ వర్షా కాలంలో దోమల నుంచి మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ,ఫైలేరియా, మెదడు వాపు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని కావున దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ మంచినీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. కార్యక్ర మంలో మండల హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎన్ఎం నర్మద, పంచాయతీ కార్యదర్శి శిరీష, ఆశా కార్యకర్తలు, ఏఎల్‌వో టీం సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రియాదవ్

నవతెలంగాణ -ఆత్మకూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ పటణ ప్రజలకు సూచించారు. ఆత్మకూరు పట్టణంలోని ఆరో వార్డులో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మున్సిపల్ కార్మికులతో వార్డులోని కాలువలు, రోడ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని కావున ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ యాదమ్మ, మున్సిపల్ సిబ్బంది, కార్మి కులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మురుగు నీరు నిల్వకుండా చర్యలు

- వనపర్తి మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ- వనపర్తి రూరల్

పట్టణంలోని ఎర్రకుంటలో మురుగు నీరు నిలువ కుండా చూస్తానని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ అన్నారు ఐదో వార్డులోని ఇందిరా కాలనీలో ఎర్రకుంట వద్ద మురుగు నీరు చేరడంతో దోమలు, ఈగలు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి శుక్రవారం మున్సిపల్ ఇంజనీర్ సాయికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, వార్డు కౌన్సిలర్ శాంతి రమేష్‌తో కలిసి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యను త్వరగా పరిష్కరించి ఎవరికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. మొదట కుంటలో నిలిచిన నీటిని బయటికి పంపేలా ఏర్పాటు చేసి కంప చెట్లను తొలగిస్తామని కుంటలో నీరు ఆగకుండా చేస్తామన్నారు.

వనపర్తి పట్టణంలో డ్రైడే

వనపర్తి రూరల్ : కలెక్టర్ ఆదేశాల మేరకు వనపర్తి పట్టణంలోని వివిధ వార్డుల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. 18వ వార్డులో స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్, వైద్య సిబ్బంది ఇండ్లలోని కూలర్లు, పూల కుండీలు, టైర్లు నీరు నిలువ ఉండే తదితర వాటిని బయట పోరా వేశారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కాలనీ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ స్పెషల్ ఆఫీసర్ సాయిరాం బాలరాజు ఆర్పి కమల ఆశ వర్కర్స్ నారాయణమ్మ ఆశలత, వార్డు కౌన్సిలర్ గంధం సత్యమ్మ, శరవంత మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

33 వార్డులో వార్డు కౌన్సిలర్ ఉంగ్లం అలేఖ్య తిరుమల్, వార్డు అధి కారి మోహన్ కుమార్ అంగన్వాడీ టీ చర్ పద్మ, ఆశ వర్కర్, జయమ్మ వార్డు జవాన్ కృష్ణ మున్సిపల్ సిబ్బంది, 32 అవార్డు కేడీఆర్‌నగర్ కౌన్సిలర్ పెండెం నాగన్న యాదవ్, ఆర్పి లక్ష్మి, ఆశా కార్యకర్త మాధవి నర్సింహులు డ్రైడే కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వీపనగండ్లలో..

వీపనగండ్ల: మండల కేంద్రంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి నరేష్ అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామంలో వీధుల్లో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇండ్లలో డ్రమ్ముల్లో, కుండల్లో నీరు ఎక్కువ రోజులు నిలువ ఉంచకుండా శుభ్రపరచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కమల, సుగుణబాయి, మహేశ్వరి, ఎల్లమ్మ సువర్ణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి పట్టణంలోని ఎర్రకుంటను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్

అమరచింతలో..

అమరచింత:అమరచింత మున్సిపాలిటీలోని మూడో వార్డులో జిల్లా స్పెషల్ ఆఫీసర్ లక్ష్మప్ప ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని కాళికాదేవి ఆలయం దగ్గర మురుగునీటి కాలువను లక్ష్మప్ప పరిశీలించారు. వార్డులలోని మురుగు కాలువల్లోని చెత్తాచెదారంను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నూరుల్ నజీమ్, చైర్ పర్సన్ వి.మంగమ్మ, కౌన్సిలర్ కే విజ యరాములు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, వార్డు ఆఫీసర్లు మునిస్వామి, గోపాల్, బాబు, లక్ష్మయ్య, సిబ్బంది చిన్న, లక్ష్మన్న, కథలప్ప, మహేందర్, ఆర్పీలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వీపనగండ్లలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భారీ వర్షానికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



నవతెలంగాణ- పెబ్బేరు

పెబ్బేరు పురపాలక కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షాలకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. వృక్షాలు విద్యుత్ వైర్లపై పడటంతో స్తంభాల సైతం విరిగిపోయాయి. పట్టణంలోని బస్టాండ్, పిజేపీ క్యాంపు కాలనీ సమీపంలో చెట్లు విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో పట్టణంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో పట్టణం చల్లబడింది. విరిగిపడిన వృక్షాలను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు విద్యుత్ అధికారులు తీవ్రంగా శ్రమించారు, వారికి మున్సిపల్ సిబ్బంది సహకారం అందించారు.



15 లోపు పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

వనపర్తి : అమ్మ ఆదర్శ పాఠశాల పనులు జులై 15 లోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి పై జిల్లా విద్యా శాఖ అధికారి, ఇంజనీరింగ్ అధికారులు మల్లయ్య, దేశ్యా నాయక్, శ్రీనివాస్, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా ఒక్కో శాఖ ద్వారా చేపట్టిన పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు మూడు రోజుల్లో మంచి నీరు, విద్యుత్, ఫ్యాన్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. డబ్బులు రాలేవు అని పనుల్లో నిర్లక్ష్యం చేయకూడదనీ, పని పూర్తి అయిన వెంటనే పేమెంట్ చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, టీజీ ఈడబ్ల్యు, ఐడిసి ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాటశాల కింద 329 పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతులు చేపట్టగా ఇప్పటి వరకు 270 పాఠశాలలు పూర్తి అయ్యాయని మిగిలిన వాటిని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 15 వరకు గడువు ఉందని ఆలోపు అన్ని పనులు పూర్తి కావాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యా అధికారి గోవిందరాజులు, పంచాయతీ రాజ్ ఈఈ మల్లయ్య, ఆర్అండ్‌బి ఇంజనీరు దేశ్యానాయక్, టిజిడబ్ల్యు, ఈఐడిసి అధికారి శ్రీనివాస్, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూరు: పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆత్మకూరు విద్యుత్ ఏ ఈ నరసింహా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132 కేవీ జూరాల సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ ఉన్నందున ఆత్మకూరు పట్టణంలో విద్యుత్ సర ఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు స్థానిక ప్రజాప్రతినిధులకు సత్కారం

నవతెలంగాణ-మదనాపురం

మదనాపురం మండలం దంతనూర్ గ్రామ ఫంక్షన్ హాల్లో శనివారం మాజీ మండల మాజీ ప్రజాప్రతి నిధులకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్లి యాదగిరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ మహానంది కృష్ణయ్య యాదవ్, మండలంలోని ఎంపిటీసిలు ఐదేండ్ల పాటు ప్రజలకు సేవలందించి మండలాభివృద్ధికి కృషి చేశారన్నారు. గురువారం నాటికి వారి పదవీ కాలం ముగియడంతో వారిని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అభినందించి సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ - అమరచింత

అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో శుక్రవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూప విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. హాస్టల్లోని 65 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ బెనర్జీ, ఆశా కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి



వనపర్తి రూరల్ :రోడ్ల విస్తరణలో భాగంగా పట్టణంలోని రాజశేఖర్ ఇంటి నుంచి విజ యసాయి అడ్వకేట్ ఇంట దగ్గర వరకు మిగిలిపోయిన డ్రైనేజ్ పనుల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని 33 వార్డ్ కౌన్సిలర్ అలేఖ్య ఉంగ్లం తిరుమల్ అన్నారు. వర్షాకాలంలో పైనుండి నీళ్లు కిందికి ఉధృతంగా వస్తున్నాయని ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి తెలిపినా తగిన చ్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సమస్యపై మున్సిపల్ ఇంజనీర్ సా యికుమార్‌కు ప్రత్యక్షంగా చూపించామన్నారు. చిన్న చినుకు పడితే మురుగు కాలువల నుంచి అనేక ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త, సంచులు, కవర్లు వంటివి బ యటకు వస్తున్నాయని ఎక్కువగా వర్షం పడినట్లు అయితే రాజీవ్ చౌక్‌లో నీరు రోడ్లపైనే ఆగుతున్నాయని దీని ద్వారా వాహనదారులు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని త్వరగా మురుగు కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఎన్నో విజయాలు సాధించింది

మదనాపురం:ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అధ్వర్యంలో గత ముప్పై ఏండ్లుగా ఎన్నో విజయాలను సాధించిందని మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు.మదనాపురం మండల పరిధిలోని గోపన్‌పేట, దుప్పల్లి, కొత్తపల్లి, దంతనూర్,తదితర గ్రామాల్లో మాదిగలతో సమావేశమై ఆ యన మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన ప్రతి గ్రామాన ఎంఆర్పీఎస్ జెండాలను ఎగురవేయాలని, అందులో అందరూ హాజరై విజయవంతంగా కార్యక్ర మాలను జరిపించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దండు కృష్ణ,కో కన్వీనర్లు అక్షయ్,సంతోష్,సాయి,ఉదయ్, రాగూర్,రాజు, మహేష్, నరేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
శనివారం | జూలై 06, 2024 | www.navatelangana.com



అద్భుతమైన పర్యాటక ప్రదేశం నల్లమల్ల

- జంగల్ సఫారీ వాహనంలో ప్రయాణించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

నవ తెలంగాణ-అచ్చంపేట

ఎంతో అద్భుతమైన పర్యాటక ప్రదేశం నల్లమల్ల ప్రాంతమని పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్టడీ టూర్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యటక శాఖ మంత్రి జూపల్లి ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటించారు. ఫరహాబాద్ నుండి జంగల్ సఫారీ వాహనంలో మంత్రులు ఎమ్మెల్యేలు వ్యూ పాయింట్‌కు ప్రయాణించారు.అడవులతో ముడిపడిన అందమైన పకృతి సహజ వనరులను అందాలను వారు ఆస్వాదించారు. ఎన్నో సహజ వనరులున్న నల్లమల్లను టూరిజం హబ్ అభివృద్ధి చేస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇలాంటి వనరులు లేకున్నా కొన్ని దేశాలు పర్యాటక రంగాన్ని కృత్రిమంగా అభివృద్ధి చేస్తూ ఆదాయ వనరులు సృష్టించుకుంటున్నారన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా నల్లమల్ల ప్రాంతాన్ని టూరిజం రంగంలో అభివృద్ధి చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు.

చెన్నయ్య మృతి పార్టీకి తీరని లోటు : ఎమ్మెల్యే

నవ తెలంగాణ - వంగూరు

మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన సల్వాది చెన్నయ్య చనిపోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచిగా విధులు నిర్వహిస్తూ ఎంతో మంది ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సేవకే అంకితం అయినా చెన్నయ్య చనిపోవడం బాధాకరమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి పూలమాలవేసి పగాడ సానుభూతి తెలిపారు. సీపీఐ(ఎం), కేవీపీఎస్ తరపున కాంగ్రెస్ యూత్ పంచాయతీ కార్యదర్శులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పండితు రావు, జడ్పీటీసీ, కెవిఎస్. రెడ్డి, ఎంపీటీసీ రమేష్ గౌడ్, వేమారెడ్డి, సతీష్ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింత ఆంజనేయులు, ఏపీ.మల్లయ్య, బాలస్వామి, రాములు, బాలయ్య, శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పరుశరాములు, అచ్చంపేట యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య ఉన్నారు.

ఆర్డీవోకు వికలాంగుల వినతి

నవ తెలంగాణ-కందనూలు



నాగర్‌కర్నూల్ ఆర్డీవోకి శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నుంచి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధం గా రూ.6వేలు పింఛన్ అమలు చేయాలని, పురుష వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం ఇవ్వాలని, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ చేయాలని, 2016 వికలాంగుల రక్షణ చట్టం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వికలాంగుల పింఛన్‌కు ఆదయ పరిమితి విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 17 ఉపసంహరించాలని, ప్రతినెల 5న పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్డీవో స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ డిమాండ్లను పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండలం నాయకులు ఆనంద్, కుర్మయ్య పాల్గొన్నారు.

చెంచులకు విద్య, వైద్యం అందించాలి

- అప్పాపూర్ మాజీ సర్పంచ్ గురువయ్య
- పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



నవతెలంగాణ-అచ్చంపేట

నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివాసముంటున్న చెంచు జాతి దినదినంగా అంతరించిపోతుంది. చెంచు కుటుంబాలకు ప్రధానంగా విద్య, వైద్యం అందించే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు కృషి చేయాలని అప్పాపూర్ మాజీ సర్పంచ్ గురువయ్య అన్నారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావులు, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు స్టడీ టూర్ పేరుతో శుక్రవారం, శనివారం రెండు రోజులు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, తమ పిల్లలకు విద్య అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఏకో టూరిజం పేరుతో అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ చెంచులకు ఎలాంటి ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లభించడం లేదన్నారు. టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందినప్పటికీ చెంచులకు కిందిస్థాయి పనులు మాత్రమే దొరుకుతాయని, దీనివల్ల పెద్దగా ఉపయోగం ఏమీ ఉండదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫారెస్ట్ ఆధ్వర్యంలో వాచర్లు టైగర్ ట్రాకర్స్‌గా కొందరు పని చేస్తున్నారు. వారికి నెలనెలా జీతాలు అందక అవస్థలు పడుతున్నారన్నారు. ఐటీడీఏ పరిధిలో 220కి పైగా చెంచుపెంటలలో 13,500 చెంచు జనాభా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. సలేశ్వరం జాతరను వారం రోజులు నిర్వహించడానికి అనుమతులు ఇవ్వాలని అధికారులకు విద్యార్థి చేసిన పట్టించుకోలేన్నారు. నల్లమలలో పర్యటిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు చెంచులకు విద్య, వైద్యం అందించే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను పాఠశాలలకు పంపించాలి

- బీటీఏ జిల్లా అధ్యక్షులు టీచర్ గాజుల వెంకటేష్

నవతెలంగాణ-ఉప్పునుంతల

బదిలీ అయిన ఉపాధ్యాయులను వారి పాఠశాలలకు పంపించాలని బహుజన ఉపాధ్యాయ సంఘం(బీటీఏ) నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు టీచర్ గాజుల వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. తొమ్మిదేళ్ల తర్వాత ఉపాధ్యాయులకు పదోన్నతులను, ఆరేళ్ల తర్వాత బదిలీలను చేపట్టిన ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఉపాధ్యాయులను వారి పాఠశాలలకు పంపించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వారి పాఠశాలలకు పంపించకపోవడంతో ఆయా పాఠశాలల్లో బోధన సరిగ్గా జరగక, విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. బదిలీల ద్వారా ఏర్పడ్డ ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. అప్పటి వరకు విద్యా బోధనకు ఆటంకం కలగకుండా విద్యా వాలంటీర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా కొన్ని గ్రామాల్లో పాఠశాలలు మూతపడ్డాయని తద్వారా పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశముందన్నారు. నాణ్యమైన విద్య అందించాలంటే మౌళిక వసతులను కల్పించి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని, ఉన్నత పాఠశాలలో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయున్ని, ప్రధానోపాధ్యాయులను నియమించాలన్నారు.

వేట కుక్కల భారీ నుంచి కాపాడండి : రైతులు

నవతెలంగాణ-ఉప్పునుంతల



ఉప్పునుంతల మండలంలోని జప్తి సదగోడు గ్రామంలో రోజు రోజుకు వేట కుక్కల బెడద ఎక్కువైతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మేకలను, లేగ దూడలను, బర్రె దూడలను చంపుకతింటున్నాయన్నారు. ఇప్పటికే 5మంది రైతులకు చెందిన లేగ దూడలను గాయపరిచి మరికొన్ని వాటిని చంపుకతిన్నాయని, అదే తరుణంలో శుక్రవారం అంకురి రాములుకు చెందిన 10వేల విలువైన మేకను పేగులు బయటకు తీసి తిన్నాయన్నారు. కోళ్ల ఫారం వద్ద చనిపోయిన కోళ్లను తినే అలవాటు పడ్డ వేట కుక్కలు ప్రస్తుతం కోళ్లు లేకపోవడంతో లేగ దూడలను వేటాడుతున్నాయని, వీటిని ఎలాగైనా కట్టడి చెయ్యాలని, అలాంటి ప్రమాదకరమైన కుక్కలను లేకుండా చెయ్యాలని రైతులు వేడుకుంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి వేటకుక్కల బెడద లేకుండా విముక్తి కల్పించాలన్నారు. అలాగే వదిలేస్తే చిన్న పిల్లల ప్రాణాలకే ప్రమాదమని వేడుకుంటున్నారు.

ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ-తెలకపల్లి



ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని జిల్లా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం అమలుతో పాటు ప్రమోషన్లు కల్పించాలని ప్రతినెల 2న వారి అకౌంట్‌లో జీతాలు వేయాలని, ప్రమోషన్ విషయంలో నిర్వహించే పరీక్షను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం జూలై 10న జాతీయ డిమాండ్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో ఆశ కార్యకర్తలు పాల్గొని తాలూకా స్థాయిలో జరిగే నేషనల్ డిమాండ్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ భాను ప్రకాష్‌కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు గోపాస్ లక్ష్మణ్, హెల్త్ సూపర్వైజర్ షసియుద్దీన్, మండల ఆశ కార్యకర్తల నాయకురాలు ఏ.పుష్ప, వరలక్ష్మి, మాధవి, కురువమ్మ, జయమ్మ, కళావతి, స్వప్న, శ్రీలత, అలివేల పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు వెల్దండ అనుకూలం

- శ్రీశైలం-హైదరాబాద్ సమీపంలో ప్రభుత్వ భూమినీ పరిశీలన
- గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు

నవ తెలంగాణ-వెల్దండ



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కల్వకుర్తి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటన చేయడం, అనువైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రానికి సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి వెల్దండ మండల కేంద్రానికి అతి సమీపంలోనీ బోజబండ వద్ద ప్రభుత్వ భూమి దాదాపు 100 ఎకరాలకు ఉన్నట్లు కల్వకుర్తి ఆర్డీవో, తహసీల్దార్ సందర్శించి పరిశీలించినట్లు సమాచారం. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారికి దాదాపు 500 మీటర్ల దూరంలో ప్రభుత్వభూమి కలిగి ఉండడంతో ప్రభుత్వం కల్వకుర్తి నియోజకవర్గానికి మంజూరు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు జరుగుతుందని కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూల వాతావరణం..

మండల కేంద్ర సమీపంలో దాదాపు 500 మీటర్ల దూరంలో 100కు పైగా ఎకరాల ప్రభుత్వ భూమి ఉండడం, యూనివర్సిటీ భవనాలు నిర్మించెందుకు చదునైన భూమితో పాటు బండ ప్రాంతం ఉండడంతో మండల వాసులు భవన నిర్మాణాలకు అనుకూల పరిస్థితులు ఉన్నాయంటున్నారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారితో పాటు కల్వకుర్తి-వెల్దండ రోడ్డు మార్గం నుండి సోమశిల-నంద్యాల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుండడం సైతం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందంటున్నారు.

కల్వకుర్తి పేరిట స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం..

కల్వకుర్తి నియోజకవర్గ పేరిట స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావడంతో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం నియోజకవర్గ కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఇక్కడి గ్రామీణ ప్రాంత యువకులకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మేరుగయ్యే అవకాశం ఉంటుందనే దిశగాకృషి చేస్తున్నట్లు సమాచారం.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా కల్వకుర్తి వాసి..

తెలంగాణ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్ రెడ్డి యువకుర్తి నియోజకవర్గ వాసిగా పేరు గాంచారు. జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి స్వగ్రామమైన ఉమ్మడి కల్వకుర్తి నియోజకవర్గంలో ఆయన రాజకీయ జీవితం ప్రారంభించి 16ఏళ్ల కాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ముఖ్యమంత్రికి కల్వకుర్తి స్వగ్రామంతో సమానంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లోనే కల్వకుర్తి నియోజకవర్గ పేరిట స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కావడంతో కల్వకుర్తి-వెల్దండ ప్రాంతాలలో డెవలప్‌మెంట్ యూనివర్సిటీ తప్పనిసరిగా ఏర్పాటు జరుగుతుందని మండల, నియోజకవర్గ ప్రజలు ధీమాతో ఉన్నారు.

హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో కల్వకుర్తి నియోజకవర్గం..

కల్వకుర్తి ప్రాంత ప్రజలకు, హైదరాబాద్ పరివాహక ప్రాంతాల ప్రజలకు కల్వకుర్తి ప్రాంతం అంటే హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉందనే చందంగా మారింది. జాతీయ రహదారి ఏర్పాటుతో ప్రతినిత్యం వేలాదిమంది హైదరాబాద్ కల్వకుర్తి రోజు వారి ప్రయాణాలు చేసే విధంగా సౌకర్యాలు ఉండడంతో హైదరాబాదుకు కల్వకుర్తి అతి సమీప ప్రాంతంగా మారిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. రవాణా సౌకర్యాలతో పాటు, జోరుగా రియల్ ఎస్టేట్ కొనసాగుతున్న నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు అయితే కల్వకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొంటున్నారు.

సకల వసతులు సమకూర్చే ప్రజాప్రతినిధుల సైతం..

రాజకీయ విలక్షణ తీర్పులకు వేదికగా ఉన్న కల్వకుర్తి నియోజకవర్గం నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భాగస్వామ్యంలో సైతం ప్రత్యేక చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గానికి మంజూరైన ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలైనా రాజకీయాలకు తావు లేకుండా అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో సమిష్టిగా అభివృద్ధికి, అభివృద్ధి నిర్మాణాలకు సకల వసతులు సమకూర్చుతూ ప్రభుత్వానికి బాసటగా నిలుస్తారు.

గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు..

కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత యువతకు మన ప్రాంతంలో సరైన ఉపాధి అవకాశాలు లేక ఉపాధి అవకాశాలపై అవగాహన లేక కూలీలుగా మారుతున్నారనడంలో అతిశక్తి లేదు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు అయితే రాబోవు రోజులలో ఆ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా శిక్షణ దొరకడంతో యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కావడం హర్షించదగ్గ విషయమని పలువురు పేర్కొంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని ఆపాలి

- సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు
- సింగరేణికి నేరుగా కేటాయించాలి
- సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-కందనూలు



దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ పెట్టుబడుదారులకు కట్టబెట్టడానికి కుట్రలు చేస్తుందని, అందులో భాగంగానే దేశంలో బొగ్గు గనులను ప్రైవేటుపరం చేయడమని సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు వర్ధం పర్వతాలు, బాల్ నరసింహ విమర్శించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర శుక్రవారం సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి దగ్గర ఉన్నబొగ్గు గనులను వేలం వేయడం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా దేశంలో నిరుద్యోగాన్ని పెంచి మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి చూస్తుందన్నారు. అందులో భాగమే ఈ బొగ్గు గనుల వేలం ప్రకటన అన్నారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో 200 బొగ్గు గనులను దేశవ్యాప్తంగా వేలం వేసిందని, ఇప్పుడు మూడోసారి గెలిచి 69 బొగ్గు గనులను దేశంలో వేలం వేయడానికి కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు 8 మంది ఎంపీలు ఉండి కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడం లేదని, ఆపడం లేదని, పైగా బీజేపీ ప్రభుత్వానికి వంత పాడటం సిగ్గుచేట న్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా నాయకులు ఆనంద్ జీ, ఆర్.శ్రీనివాస్, వార్ల వెంకట య్య, జి.అశోక్, కేశవులు గౌడ్, పొదిలి రామయ్య, కృష్ణాజి, లక్ష్మీపతి, సురేష్, అంతటి కాశన్న, మధు, సత్యనారాయణ, శివరాం, సురేష్, సుభాష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వద్దు : ఎమ్మెల్సీ

- విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-తెలకపల్లి



ప్రజలు ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహించవద్దని, ఆరోగ్య సూత్రాలను పాటించి సంపూర్ణంగా ఉండాలని ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కమ్మరెడ్డిపల్లి గ్రామంలో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రి మలక్‌పేట, ఎల్‌వి.ప్రసాద్ ఆస్పత్రి, తుడుకుర్తి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని ప్రజలకు సూచించారు. ఈ సీజన్‌లో వాతావరణ మార్పుల వలన వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ప్రజల ప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉచిత వైద్య శిబిరంలో 400మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జీవి.రామకృష్ణ, కార్యదర్శి సంపత్ కుమార్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు జయకుమార్, హైదరాబాద్ గాంధీ స్మారక నిధి ప్రతినిధి, హైదరాబాద్ కలాం ఫౌండేషన్ అధ్యక్షులు బుచ్చన్న హైదరాబాద్. జెఎస్ఆర్ ఫౌండేషన్ సతీష్ రెడ్డి, కమ్మారెడ్డి పల్లి ఉపసర్పంచ్ జానకిరామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ.. విద్యకు మంత్రి లేడు

- ఎన్.కిరణ్ కుమార్ సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి
- శిథిలావస్థలో నార్లాపూర్ ప్రాథమిక పాఠశాల
- నిద్రావస్థలో ప్రభుత్వ యంత్రాంగం
- బిక్కు బిక్కుమంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు



నవతెలంగాణ- కొల్లాపూర్ రూరల్



మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ.. విద్యకు మంత్రి లేడని సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి ఎన్.కిరణ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విషయం తెలుసుకున్న నార్లాపూర్ ఆయన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల భవనాన్ని నిర్మించి దాదాపు 50ఏళ్ల పైబడింది కాబట్టి వర్షాకాలం కావడంతో గోడలు బీటలువారి, భవనం పైకప్పు పెచ్చులుడుతుంటే విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న మద్యానికి మంత్రి ఉన్నాడు గానీ విద్యకు మంత్రి లేకపోవడం దురదృష్టకరమన్నారు. కాబట్టి తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి, తక్షణమే నూతనపాఠశాల భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై పటిష్ట చర్యలు ఎక్కడ..?

- కనిపించని డ్రై డే..
- కలెక్టర్ ఆదేశాలు పాటించని అధికారులు
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- పంచాయతీరాజ్ శాఖలో పారిశుద్ధ్య లోపం..
- స్పందించని మండల వైద్యాధికారి



నవతెలంగాణ-ఉప్పునుంతల

సీజనల్ వ్యాధులపై దృష్టి సాధించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ గత నెల జూన్ బుధవారం 26న కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌ఓ సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, డెమోరియా, వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సమయంలో దోమలు, ఈగలు, వైరస్, బ్యాక్టీరియా వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు బెడద ఎక్కువగా ప్రజలపై ప్రతాపం చూపుతాయి అన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులను నిరోధించవచ్చు అన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు వాటి నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకొని అప్రమంతంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా నుండి గ్రామస్థాయి వరకు పారిశుద్ధ కార్మికులు, వైద్యం, అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎం, ఆశ ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి గురించి వారి ఇంటి పరిసరాలను పరిశీలించి గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిశుద్ధ పనులు నిర్వహిస్తూ ఉండాలన్నారు. వారానికి ఒకరోజు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని మండలస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసి రెండు వారాలు గడుస్తున్న నేటికీ ఉప్పునుంతల మండలంలోని 27 గ్రామాలు ఉన్న పల్లెల్లో తండాల్లో అవగాహన కల్పించే అధికారులు, ప్రజా ప్రతినిధులు అలసత్వం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్న ప్రజలను ఆదుకునే నాథుడు ఎవరు..? మండలంలో అధికారులను మేల్కొల్పండి సార్ మురికి నీటి గుంటలను డ్రైనేజీ లేని రోడ్లను పరిశీలించి డ్రైడే వర్క్ ఫ్రం హోం నిర్వహించి ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- తహసిల్దార్ చెన్న కిష్టన్న



నవతెలంగాణ - ఊరుకొండ

నాగర్‌కర్నూలు జిల్లా ఊరుకొండ మండల పరిధిలోని ఊరుకొండపేట గ్రామ శివారులో గల మిషన్ భగీరథ పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకులకు, పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయానికి నష్టం వాటిల్లకుండా దూరంగా పనిముట్లతో వడ్డెరులు రాతి పనులు చేసుకోవాలని.. నిబంధనలు పాటించకుండా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ చెన్న కిష్టన్న సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఊరుకొండపేట, నర్సంపల్లి శివారులో గల హనుమండ్లగుట్టపై మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను, పైప్‌లైన్లను ఆయన ఎస్సై వీరబాబు, రెవెన్యూ సిబ్బంది ఆకస్మికంగా పరిశీలించారు. హనుమండ్ల గుట్టపై వడ్డెర పనులు చేయిస్తున్న దళారులకు, వడ్డెరులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వడ్డెరలు చేతి పనిముట్లతో పనులు చేసుకోవాలని.. కాదని జేసీబీ, హిటాచి, కంప్రెషన్‌లు, బ్లాస్టింగ్‌లు వాడినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని.. బ్లాస్టింగులు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసిల్దార్, ఎస్సైలు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులకు, పైపులైన్లకు, దేవాలయానికి దూరంగా పనులు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సతీష్ చంద్ర, రెవెన్యూ సిబ్బంది, వడ్డెరులు, తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధే మంత్రి జూపల్లి లక్ష్యం

నవతెలంగాణ-కొల్లాపూర్

కొల్లాపూర్ నియోజకవర్గ పాఠశాలల అభివృద్దే మంత్రి జూపల్లి కృష్ణారావు లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల గర్ల్స్ హై స్కూల్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల యాజమాన్యం బాలికల మౌలిక వసతులతో పాటు, అనేక సమస్యలను మున్సిపల్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి పాఠశాలలోని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా టాయిలెట్స్‌తో పాటు పరిసరాల పరిశుభ్రత చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 8, 9, 10వ తరగతుల విద్యార్థినిలకు అందించే డిజిటల్ బోధన గురించి తెలుసుకు న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్థానిక కౌన్సిలర్ పిన్నంశెట్టి జ్యోతి శేఖర్, పాఠశాల యజమాన్యం తదితరులున్నారు.

వర్షం.. రైతన్న హర్షం

నవ తెలంగాణ-పెంట్లవెల్లి



మండల కేంద్రంలోని పలు గ్రామాలలో శుక్రవారం సాయంకాల సమయంలో మోస్తారు వర్షం కురిసింది. దీనితో ఒకసారిగా వాతావరణం మొత్తం చల్లబడింది. దీంతో రైతులకు విత్తనాలు వేసుకోవడానికి అనుగుణంగా మారిపోయింది. దీనితో పలు గ్రామాలలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి జల్లుల కోసం చూస్తున్న ఈ సమయంలో వర్షం కురవడంతో తమకు పంటలు వేసుకోవడానికి వీలుగా మారిందని రైతులు అంటున్నారు.

విజయ డైరీ ముందు రైతుల ఆందోళన

నవ తెలంగాణ- వంగూరు

మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో శుక్రవారం రైతులు విజయ డైరీ ముందు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని రైతులు ఉపాధి కోసం ఒక్కొక్క రైతు ఆవులను, గేదెలను రూ.60 వేల నుండి 1 లక్ష పైగా అప్పుచేసి కొనుగోలు చేసి పాల రూపంలో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కానీ విజయ డైరీ నిర్వాహకులు ఏం చేస్తున్నారంటే పాలశాతాన్ని మిషన్ రూపంలో కాకుండా చేతి ద్వారా రాయడం, వారి ఇష్టారాజ్యంగా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ డైరీ అని ప్రజలు నమ్మి పాలు పోస్తే లీటర్ పాలు రూ.30 నుండి రూ.35 మాత్రమే కట్టియ్యడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు ఇది ఏమిటి అని అడిగితే వెన్న శాతం రావట్లేదని లేనిపోని కాహనీలు చెప్పి పాలు పోసే రైతులను మోసం చేస్తున్నారని రైతులు లబోదిబో మొత్తుకుంటున్నారు. రైతుకు వెయ్యి లేక రెండు వేలు తక్కువ బిల్లు కట్టిస్తూ అందరినీ మోసం చేస్తున్నారని తెలిపారు. ఇలా మోసం చేస్తున్న వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని రైతుల కోరారు. బిల్ వచ్చే మిషన్ వెంటనే ఏర్పాటు చేసి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే పాలు పోసే రైతులము అందరం కలిసి పాలు పోయడం ఆపేస్తామన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నారాయణపేట
శనివారం | జూలై 06, 2024 | www.navatelangana.com

మండల ప్రత్యేకాధికారిగా కే. నరసింహారావు



క్రిష్ణా : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా శుక్రవారం కృష్ణా మండల ప్రత్యేక అధికారిగా నారాయణపేట జిల్లా, జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కే నరసింహారావును నియమించింది. శుక్రవారం ఆయన స్థానిక మండల ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ నెల 4తో జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవి కాలం పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం మండలలాను సుపరిపాలనను అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ సందర్భంగా ఎంపీడీవో జానయ్య, ఎంపీఓ విజయలక్ష్మి ఆయనను ఆహ్వానించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో తమ విధులను నిర్వర్తించాలని, ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు.

అర్ధరాత్రి అక్రమ అరెస్టులు తగదు



నవతెలంగాణ - గట్టు

అర్ధరాత్రి అక్రమ అరెస్టులు తగదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు హాలింపాషా జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. గురువారం అర్ధరాత్రి గట్టు పోలీస్ స్టేషన్‌కు వారిని తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ పోస్టులను పెంచుమంటే ఇంత నియంతృత్వమా అని ప్రశ్నించారు. ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని, డీఎస్సీ కనీసం 45 రో జుల వరకు పొడగించాలని అన్నారు. గ్రూప్స్ 1:50 పై ప్రభుత్వం పునరా లోచించాలని కోరారు. గురుకుల అభ్యర్థులకు న్యాయం చేయాలని, అన్నీ శా ఖలలో ఖాళీలను ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హామీలను అమలు చేయాలని..

వీహెచ్‌పీఎస్ ధర్నా





నవ తెలంగాణ - నారాయణపేట

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీ హెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షులు అజిత్ ఖాన్ హాజరై మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ.6 వేల పింఛన్, వితంతులకు, వృద్ధులకు ,ఒంటరి మహిళలకు, గీతా కార్మికులకు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్‌ను చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్న ఇదివరకు పింఛన్‌ను పెంచలేదని అన్నారు. పింఛన్లు పెంచకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వికలాంగుల హక్కు చట్టం 2016 రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో వికలాంగులకు 5 శాతం కల్పించాలని, వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్రంగా ఉంచుతూ 02.12.2022న జీ. ఓ.నెం.33ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు పూర్తిగా నడవలేని వాళ్లకు 60 శాతం పైన వున్న వికలాంగులకు స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శి అలంపల్లీ నరేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కర్రెప్ప అలియాస్ కళ్యాణ్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు జీర్గాల్ నాగేష్, వీహెచ్‌పీఎస్ నాయకులు, గోపాల్, శంకర్, జావేద్, ఇలియాస్, ధన్వాడా మహిళా నాయకులు మణెమ్మ, మంగలి లక్ష్మి, అమ్మక్క, యలమ్మ, వరలక్ష్మి, మణెమ్మ, మోగులప్ప, ఖాసీం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి : ఎస్ఐ



మక్తల్ : ప్రజలు మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయి, గుట్కా, మద్యపానం తదితర వాటికి దూరంగా ఉండాలని ఎస్ఐ బాగ్యలక్ష్మి రెడ్డి సూచించారు. శుక్రవారం మక్తల్ మండలంలోని మంతన్ గోడ్ గ్రామంలో ఎస్ఐ బాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు పోలీస్ కళాబృందం సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ చట్టాలు, సీసీ కెమెరాలపై మాటలు, పాటల రూపంలో అవగాహన కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయి, గుట్కా, మద్యపానం తదితర వాటికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు సేవించడం వల్ల అనారోగ్య పాలు కావడంతో పాటు ఆర్థికంగా కుటుంబాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. మత్తు పదా ర్థాలకు బానిసలై జీవితాలు నాశనం అవుతాయని, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురి కాకుండా జాగ్రత్త పడాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి లేదా డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగతనాల నిర్మూలనకు గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాలలో అసంఘటిత కార్యక్రమాలు నివారించడానికి అవకాశం ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, గ్రామ పెద్దలు, పోలీసు సిబంది, కళాబృందం సభ్యులు సురేందర్ గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుక్య నాయక్ మొదలగు వారు పాల్గొన్నారు.

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

నవ తెలంగాణ - ఊట్కూర్

తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యాలయాలలో ఉద్యోగాల భర్తీ కోసం పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించకుండా గురుకుల టీజీటీ, పీజీటీ, జెఎల్, డీఎల్ అభ్యర్థుల 1, 2 ధ్రువపత్రాలను పరిశీలించారు. ఇలా చేయడం వలన ఒకొక్క అభ్యర్థికి రెండు ,మూడు,నాలుగు ఉద్యోగాలు రావడం వలన తదుపరి మెరిట్‌లో ఉన్న 3000 అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని గురుకుల 1,2 సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు హెచ్.నర్సింహా, రాకేష్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఉద్యోగాలకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఒక్క అభ్యర్థికే ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు రావడంతో ఆ అభ్యర్థి తర్వాత మెరిట్ ఉన్న వారు ఉద్యోగం కోల్పోవలసి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక వేళ ఫలితాలు ప్రకటించి అవరోహణ క్రమంలో మొదట డీఎల్ పోస్టులు, తర్వాత జెఎల్, ఆ తర్వాత పీజీటీ చివరికి టీజీటీ పోస్ట్ లు భర్తీ చేసి ఉంటే మొత్తం 9210 పోస్టులు భర్తీ అయ్యేవని , ప్రభుత్వ తప్పిదం వల్ల 3000 పోస్టులు మిగిలిపోయే అవకాశం ఉందన్నారు. జూలై 3 తేది వరకు అన్ని సబ్జెక్టుల 1:1 అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేశారు .వెబ్ ఆప్షన్ మాత్రమే మిగిలి ఉంది. వెబ్ ఆప్షన్ కంటే ముందే ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చిన వారి దగ్గర రీలింక్విష్మెంట్ తీసుకొని హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసి గురుకుల విద్యాలయాల్లో మిగిలిన పోస్టులు తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయుటకు గెజిట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్ గౌడ్, రాధకిషన్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు ఆపాలి : సీఐటీయూ

నవతెలంగాణ - నారాయణపేట

పోలీసులు అక్రమ అరెస్టులను మానుకోవాలని, అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచాలని సీఐటీయూ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు జీ.వెంకట్రామరెడ్డి, బాల్‌రామ్‌లు డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని ఉద్యమిస్తుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని ,తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నారాయణపేట జిల్లా అధ్యక్షులు వెంకట్రామ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ విమర్శించారు. శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకే యూనియన్ నాయకుల ఇండ్లకు పోలీసులు వెళ్లి అక్రమ ఆరెస్టులు చేస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించాలని అన్నారు. 40 సంవత్సరాలు ఐసీడీఎస్ లో బడుగు బలహీన వర్గాలకు సేవలందించిన అంగన్వాడీలకు అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ అందిస్తూఅగౌరవ పరుస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీల పోరా టంపై ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే నిలిపివేసి రిటైర్మెంట్ అవు తున్న అంగ న్వాడీలకు గౌరవపదంగా ఇంటికి వెళ్లేం దుకు గత ప్రభు త్వం ఒప్పందం మేరకు పదవీ విరమణ బెనిఫిట్ కనీసం రూ. 2 లక్షలు కల్పించాలని అన్నారు. రిటైర్మెంట్ అవు తున్న వారికి వేతనంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలన్నారు.

నవ తెలంగాణ - మక్తల్

అంగన్వాడీలకు రెండు లక్షల రిటర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని ఉద్యమిస్తుంటే ప్రభుత్వం అక్రమంగా అరెస్టులకు పాల్పడుతుందని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నారాయణపేట జిల్లా కో కన్వీనర్ గోవిందరాజ్ , యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్. మంజుల అన్నారు. ఇది పోలీసుల హేయమైన చర్య అని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం చలో కొడంగల్ సీఎం ఇంటి ముందు ధర్నా కు వెళ్తుంటే మక్తల్ లో అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులను చేస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించాలని, 40 సంవత్సరాలు ఐసీడీఎస్ లో బడుగు బలహీనవర్గాలకు సేవలందించిన అంగన్వాడీలకు అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ అందిస్తూ అగౌరపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ - మాగనూరు

అంగన్వాడీలకు రెండు లక్షల రిటర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని ఉద్యమిస్తుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)) నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు విమర్శించారు . పోలీసుల చేత ఈరోజు చలో కొడంగల్లో సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమంలో భాగంగా బయల్దేరిన యూనియన్ నాయకుల ఇండ్లలకు వెళ్లి అక్రమ ఆరెస్టులు చేస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించాలన్నారు. 40 సంవత్సరాలు ఐసీడీఎస్‌లో బడుగు బలహీన వర్గాలకు సేవలందించిన అంగన్వాడీలకు అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ అందిస్తూ అగౌరవపరుస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీల పోరాటంపై ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే ఆపి రిటైర్మెంట్ అవుతున్నఅంగన్వాడీలకు గౌరవపదంగా ఇంటికి వెళ్లేందుకు గత ప్రభుత్వం ఒప్పందము మేరకు పదవీ విరమణ బెనిఫిట్ కనీసం 2 లక్షలు కల్పించాలని అన్నారు . రిటైర్మెంట్ అవుతున్న వారికి వేతనంలో సగం పింఛన్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, అండ్ హెల్పర్స్ శోభ, తులసి, జగదీశ్వరి, మహేశ్వరి, ముద్దమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేటలో



మక్తల్‌లో..



మాగనూరులో..

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి : ఐఎఫ్‌టీయూ



నవతెలంగాణ - నారాయణపేట

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి బీ.నరసింహ, జిల్లా కార్యదర్శి బోయిన్ పల్లి రాము కోరారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పురవీధుల గుండా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ వెళుతున సమయంలో పోలీసులు మున్సిపల్ పార్కు దగ్గర పోలీసులు అడ్డు తగిలి బారికెడ్లను రోడ్డుకు అడ్డంగా వేశారు.అక్కడే రోడ్డుపై కార్మికులు బైఠాయించి నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నరసింహ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వేలాది మల్టీపర్పస్ వర్కర్స్ అతి తక్కువ వేతనాలు నెలకు రూ.9,500లతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ఇచ్చే జీతమే అతి తక్కువ, అది కూడా ప్రతి నెల రాక నెలల తరబడి జీతాలు చెల్లించక పోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని చిన్న గ్రామ పంచాయితీలలో సంవత్సరంగా జీతాలు అందని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లిస్తున్నా కానీ జీ.పీ సిబ్బందికి ఎందుకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి రాష్ట్ర వ్యాప్తంగా 3 నుంచి 8 నెలల వరకు వేతనాలు పెండింగ్లో ఉన్నాయని, వేతనాల చెల్లింపు చట్టం 1936 ప్రకారం ప్రతి నెల 5 లేదా 10 తేదీ లోపు జీతాలు ఇవ్వనిచో చట్ట రీత్యా నేరం అన్నారు. ఆలస్యం చేయబడిన జీతాలకు 10 రెట్లు అదనంగా చెల్లించాలని చట్టం పేర్కొన్నట్లు తెలిపారు. చట్టాలను కాపాడాల్సిన ప్రభుత్వమే ఉల్లంఘిస్తే ఎవరితో మొరపెట్టుకోవాలని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జీపీ సిబ్బంది శ్రమతో రాష్ట్ర ప్రభుత్వానికి అనేక అవార్డులు, రివార్డులు వచ్చాయని, కానీ 5 నెలల వేతనాలు పెండింగ్లో ఉంచారన్నారు. గ్రామ సర్పంచ్‌లుగా పదవి కాలం ముగిసిన వెంటనే కార్మికులకు ఈ కష్టకాలం దాపురించిందన్నారు. సర్పంచ్‌ల స్థానంలో స్పెషల్ ఆఫీసర్లను నియమించారని, దీంతో జీతాలు ఆలస్యం అవుతున్నాయని ప్రభుత్వం పేర్కొంటే, పంచాయతీ రాజ్ మొత్తం వ్యవస్థలోనే జీతాలు ఆగినాయా? నెలకు కేవలం రూ.9,500 లు మాత్రమే పొందుతున్న సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించలేరా? ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన గ్రామ పంచాయితీ సిబ్బంది పెండింగ్ జీతాలను తక్షణమే అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. 2021 పీఆర్సీ నివేదిక ప్రకారం 30 శాతం ఫిట్మెంట్ జీ.పీ సిబ్బందికి వర్తింపచేయలేదని అన్నారు. అదే లోకల్ బాడీ, మున్సిపల్ కార్పోరేషన్లో పీఆర్సీ నివేదిక ప్రకారం.. 30 శాతం ఫిట్మెంట్‌ను అమలు చేస్తున్నారని, దాని ప్రకారం జీపీలో అమలు చేయాలని 34 రోజులు సమ్మె చేసినా, ఆనాటి ప్రభుత్వం 60 జీవోను అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఈ కార్మికుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని పీఆర్సీ జీవో 60 ప్రకారం వేతనాలను అమలు చేయాలని, నైపుణ్యం లేని పనికి రూ. 16,600, అర్ధనైపుణ్యం రూ.20,500, నైపుణ్యం గల కార్మికులకు రూ.23,750 రూ ఇచ్చేటట్టు చూడాలని అన్నారు. అనంతరం వివిద డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ రాణా ప్రతాప్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల గ్రామపంచాయతీ యూనియన్ ఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుట్టు, జిల్లా కోశాధికారి రామాంజనేయులు, నాయకులు ప్రశాంత్, నారాయణ, సుశాంత్, తాయప్ప, కొండప్ప, రాజప్ప, రామచందర్, బీములు, మహదేవ్, పరశురాం, వెంకటయ్య, రాములు, నర్సింలు తోపాటు గ్రామ పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.



షీ టీమ్ పోలీసులతో భరోసా : ఎస్పీ



నవతెలంగాణ - నారాయణపేట

మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే వెంటనే షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712670398 కు సమాచారం ఇవ్వాలని సెటిల్ పోలీసులు తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళలు, విద్యార్థి నులు ఎవరైనా వేధింపులకు గురైన ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ చేసిన వెంటనే జిల్లా షీ టీమ్ పోలీసులను సంప్రదించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలోని షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళా శాలలు, పాఠశాలల్లో, తెలంగాణ మోడల్, రెసిడెన్షియల్ , కేజీబీవీ స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్ హ్యూమెన్ ట్రాఫికింగ్ తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కళాశాలలో స్టూడెంట్స్, లెక్చరర్స్ తో కలిసి యాంటీ ర్యాగింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భగా ఎస్పీ మాట్లాడుతూ షీ టీమ్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తాయని తెలిపారు. షీటీమ్ కంప్లైంట్ క్యూఆర్ కోడ్ గురించి తెలియజేస్తూ ఆన్లైన్ ద్వారా ఎక్కడి నుంచి అయిన ఫిర్యాదు చేసేందుకు ఉపయోగపడే ఈ షీటీమ్ కంప్లైంట్ క్యూఆర్ కోడ్ స్కానింగ్ పోస్టర్స్ ను జిల్లాలో బస్ లలో, బస్ స్టాండ్ లలో, సినిమా హల్ లు, స్కూల్స్, కళాశా లలు, ఇతర ముఖ్యమైన, రద్దీ ప్రాంతాలలో అతికించబడి ఉంటాయని, జిల్లాలో ఎవరైనా బాధిత మహిళలు షీటీమ్ కు ఫిర్యాదు చేయాలనుకుంటే ముందుగానే తమ మొబైల్ నందు క్యూఆర్ కోడ్ స్కానర్ ను కలిగి ఉండాలని, తమ ఫోన్ తో పోస్టర్ పై ఉన్న కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా లింక్ వస్తుందని, దీనిని క్లిక్ చేయగానే ఫిర్యాదు ఫారం ఓపెన్ అవుతుందని పేర్కొన్నారు. అందులో పేరు, లొకేషన్ తదితర వివరాలను పూరించి సబ్మిట్ చేయగానే జిల్లా పోలీస్ కార్యాలయంలో షీటీమ్ సాఫ్టవేర్ విభాగానికి చేరుతుందని తెలిపారు. అక్కడ నిరంతరం పర్యవేక్షించే సిబ్బంది ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆ లొకేషన్ కు దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు ఫార్వర్డ్ చేయడం ద్వారా సంబంధిత అధికారులు లొకేషన్‌కు చేరుకొని తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. వేధింపులకు గురయ్యే మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, అంతే కాకుండా మహి ళలను ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712670398 లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

సింగరేణి వేలంను ఆపాలి

- సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్



నవతెలంగాణ - నారాయణపేట

జిల్లా కేంద్రంలోనీ మున్సిపల్ పార్కు దగ్గర సింగరేణిని ప్రైవేటీకరించవద్దు సింగరేణి కాపాడుకుందాం అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి బీ నరసింహ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ హాజరై మాట్లాడుతూ స్వదేశీ, మోదీ గ్యారంటీ నినాదాలతో 3వ సారీ అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ, అమీషా బీజేపీ ప్రభుత్వం జాతీయ వనరులను, ఖనిజాలను, జాతి సంపదలను నిలువునా కార్పోరేట్ కంపెనీలకు, కట్టబెట్టే ప్రణాళికను వేగవంతంగా అమలు చేసే ప్రైవేటు విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని 500 కోల్ బ్లాక్లలో ఇప్పటికే 300 బ్లాక్లను ప్రైవేట్ కార్పోరేట్ కంపెనీలకు దారదత్తం చేసిందన్నారు. దాని కొనసాగింపులో నుంచి 60 కోల్ బ్లాక్లను అమ్మటానికి వేలం నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. కోల్ ఇండియా, సింగరేని లాంటి ప్రభుత్వ సంస్థలకు అప్పగించి బలోపేతం చేయడం కాకుండా ప్రైవేట్ వర్గాలకు అమ్మి మన థర్మల్ స్టేషన్లకు కావాల్సిన బొగ్గును వారి నుంచి కొనుగోలు చేస్తున్నదని అన్నారు . మన ప్రభుత్వ కోల్ సంస్థలు కోల్ టన్నుకు 3500 - 4000 రూపాయలకు అమ్ముతుండగా ఆదానీ, అంబానీ లాంటి గుత్త పెట్టుబడదారులు, కార్పోరేట్ కంపెనీల నుంచి టన్నుకు 18,000 రూ.లకు - 18 లక్షల టన్నుల బొగ్గును కొనుగోలు చేస్తున్నదన్నారు. జాతి విద్రోహం. దేశ వనరులను తెగనమ్మేవి మన రాష్ట్రంలో ఇప్పటికే సత్తుపల్లి, కోయగూడెం ఓ.సి.లను అరబిందో, మరో సంస్థకు బీఆర్ఎస్ హయాంలోనే వేలం జరిగిందని ఇప్పుడు మరో 3 బ్లాక్లను వేలానికి పెట్టిందన్నారు. సింగరేణి ఇప్పటికి ఆపరేట్ చేస్తున్న 39 బ్లాకులలో కొన్ని ఓ.సీ.లు, అండర్ గ్రౌండ్ మైన్స్ మూతపడ్డాయన్నారు . రానున్న 5-10 ఏండ్లలో మరికొన్ని మూతపడే పరిస్థితి వున్నదన్నారు. ఈ పరిస్థితే వుంటే రానున్న 10-15 ఏండ్లలో సింగరేణి ఉనికికే ముప్పు వున్నది. 140 సం.ల చరిత్ర వుండి, ఎంతో మందికి ఉపాధిని కల్పించిన, ఏజెన్సీ ఏరియాలో అభివృద్ధికి తోడ్పడిన సింగరేణిని కాపాడటం అవసరమన్నారు. సింగరేణి సంస్థకు మన రాష్ట్రంలోని కోల్ మైన్స్ను ఉచితంగా ఇవ్వాలన్నారు . వేలం పాట నుంచి వాటిని మినహాయించాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ మూడు పార్టీలు ఈ వేలాలకు, ప్రైవేటీకరణకు అనుకూలమన్నారు . వీరి మధ్య విధానపర తేడా లేదన్నారు . వీరు ఇక్కడ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు . దీనిపై ప్రభుత్వం, రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు తీవ్ర నిరసన తెలపాలన్నారు . సింగరేణి రక్షణకు, తద్వారా 42,000 మంది ఉపాధి రక్షణకు పాటుపడాలన్నారు. అక్రమార్కుల పాలిట ఈ ప్రభుత్వాలు వరంగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు బోయిన్పల్లి రాము, డివిజన్ నాయకులు ప్రశాంత్ , పార్టీ టౌన్ కార్యదర్శి కెంచ నారాయణ , ఐ ఎఫ్ టీ యూ జిల్లా సహాయ కార్యదర్శి ఏ నర సింహ, ఉపాధ్యక్షులు ఏజీ భుట్టో , కోశాధికారి రామాంజనేయులు, పార్టీ నాయకులు కృష్ణయ్య, రామచందర్ , కృష్ణయ్య హనుమంతు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాయి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జోగులాంబ-గద్వాల
శనివారం | జూలై 06, 2024 | www.navatelangana.com

డీఐ ఈ ఓ గా బాధ్యతలు చేపట్టిన కే రాధ



నవతెలంగాణ - వనపర్తి

వనపర్తి జిల్లా కేంద్రంలోని ఖిల్లాపురం ప్రభుత్వ ప్రిన్సిపాల్ గా పనిచేయుచున్న కె. రాధ ను డీఐ ఈ ఓ గా నియమిస్తూ ఇంటర్ విద్య డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇన్చార్జి డీఐఈఓగా ఉన్న సి. మద్ది లేటి జూన్ 30 న పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో కె.రాధను నియమస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో శుక్రవారం ఆమె డీఐఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఐఈఓ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శాలు వాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ నరేష్, జూనియర్ అసిస్టెంట్ ఆనందం, టైపిస్ట్ శివకుమార్, రికార్డు అసిస్టెంట్ అబ్దుల్ రహీం, బాలరాజు పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్పీ



నవతెలంగాణ - వనపర్తి రూరల్

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్పీ సూచించారు. శుక్రవారం ఎస్పీ వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌సందర్శించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేలా సమ గ్ర విచారణ చేపట్టి బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. కొత్త చట్టా లపై ప్రతి ఒక్క సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఆదే శించారు. స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. పలు కేసుల వివరాలు ఎస్ఐ జయన్న , రామా రాజులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్టేషన్లో పనిచేసే సిబ్బంది అందరూ కూడా వర్టికల్స్ వారీగా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు . దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రోజువారి పురోగతి సీసీటీఎన్ఎస్‌లో అప్లోడ్ చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, ఏ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ ఆపాలి

- ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

సింగరేణి బొగ్గు గనులను ప్రయివేటీకరించి అమ్ముకునేదుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీ యూసీ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, మోడీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. తెలంగాణ బీజేపీ నాయకులు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఉద్దేశించి ఏఐటీయూసీ (సీపీఐ) జిల్లా అధ్యక్షులు బీ. ఆంజనేయులు , సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీ.వీ. నరసింహ మాట్లాడుతూ పకృతి ప్రసాదించిన సహ జ వనరులు ప్రతి పౌరుడికి దక్కాలని , ఈ భూమి మీద వ్యక్తుల కోసం కాకుండ ప్రభుత్వానికి హక్కు ఉండాలని, అనేక ఏళ్లుగా పోరాడి సాధించు కున్న ప్రభుత్వ రంగ సంస్థ లను సింగరేణి బొగ్గు బ్లాకు లను మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు, ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవడం సిగ్గుచేటని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు , కార్మికులు , ఉద్యోగులు సంఘటితంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తా మని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాల యంలో కలెక్టర్ లేకపోవడంతో ఏఓ. భద్రప్పకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపా ధ్యక్షులు నరసింహ,ఏఐటీయూసీ జిల్లాకమిటీ సభ్యులు ప్రకాష్, ప్రభుదాస్, బజారు హమాలీ సీఐటీయూ కార్మికులు గజేంద్ర, రఘు, ఏఐఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్, వీరేంష్, ఏఐటీయూసీ నాయకులు ప్రభు, ధర్మన్న, రాకేష్తో , నాయకులు మజ్జిగ ఆంజనేయులు , కృష్ణ , నరేష్ , విష్ణు , పరుశురాం,భాస్కర్, కార్మికులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలంను రద్దు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రాజు





నవతెలంగాణ - ఉండవల్లి / అలంపూర్

సింగరేణి బొగ్గు గనుల వేలంను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజు అన్నారు. శుక్రవారం మానపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి సింగరేణి రద్దు చేయాలని బొగ్గు గనులను సింగరేణి సంస్థకు అప్పగించాలని అంబేద్కర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రై వేట్ సంస్థలకు అప్పజెప్పడం కోసం వేలం నిర్వహించిందని విమర్శించారు. తెలంగాణలో సింగరేణి కాలనీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే ప్రస్తా వించిన ప్రభుత్వ రంగ సంస్థలని శ్రావణి పల్లెలో బొగ్గు అవడం కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. బొగ్గు బ్లాక్ లన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి సింగరేణి సంస్థను బలహీనపరిచేందుకు కుట్ర చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు బ్లాకులు గత టీఆర్ఎస్ పాలనలో మోడీ ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని అన్నారు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలంను ప్రారం భించడం అన్యాయమని అన్నారు. ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రవేట్ సంస్థలకు కట్టబెడుతుందని, అందులో భాగంగానే రూ.28 వేల 747 కోట్లు విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించారని , గత పది ఏళ్లలో ప్రభుత్వం దాదాపు 200 బవులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరిగిన వేలం రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎనిమిది మంది శాసనసభ్యులు, ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులు ఉండి కూడా రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవడం లేదని విమర్శించారు . ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు భాస్కర్ , మహేష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - అలంపూర్

బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని శుక్రవారం అలంపూర్ పట్టణంలోని గాంధీ విగ్రహం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బీ. నరసింహ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ పది సంవత్స రాలు పరిపాలించిన, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2017 సంవత్సరంలో తీసుకొచ్చిన మైండ్స్ అండ్ మినరల్ ఆక్ట్ సవరణల బిల్లుపై ఆ పార్టీ మౌనం వహించడం జరిగిందని విమర్శి ంచారు. 2021 వ సంవత్సరంలో హెూల్ బ్లాక్ ల వేలంలో సింగరేణి సంస్థను పాల్గొనకుండా చేశారని విమర్శించారు. నాటినుండి కేంద్ర ప్రభుత్వము సిం గరేణి బొగ్గు గనులను ప్రవేట్ సంస్థలకు అప్పజె ప్పాలని ప్రయత్నాలు చేసిందని, నేడు ఆ బొగ్గు గనులను బహిరంగంగానే వేలం వేయడం జరుగుతోందని, దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలంను రద్దు చేస్తూ, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడీ తీసుకురావాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సిద్దయ్య, ఆటో డ్రైవర్లు కమాల్, వసంత్ కుమార్, రవి, గణేష్, గ్రామ ప్రజలు శ్రీనివాసులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖకు నూతన అధికారులు

నవతెలంగాణ - ఉండవల్లి

అల్లంపూర్ సర్కిల్ మద్యం శాఖ పరిధిలో కొత్తగా అధికారుల బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న అధికారులు బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో అయిజ ఎస్ఐగా మమత బాధ్యతలు స్వీకరించారు. ఆమె అల్లంపూరు , మానపాడు ,ఉండవల్లి మండలాల్లోని ఎక్సైజ్ శాఖ ఎస్ఐగా ఇన్చార్జి బాధ్యతలు నిర్వ హించినట్లు సీఐ హనుమాన్ నాయక్ తెలిపారు. మద్యంశాఖ ఎస్ఐగా లక్ష్మీనారాయణ, అల్లంపూరు, ఇటిక్యాల, ఎర్రవల్లి , రా జోలి మండలాల్లో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. కానిస్టేబులు ఆరుగురు ఒకరు ట్రైనింగ్‌లో శిక్షణ పొందుతున్నట్లు ఒక రెడ్ కానిస్టేబుల్ నిత్యం నిఘా పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక , మహారాష్ట్ర సరిహద్దు పరిధిలో పర్యవేక్షణ చేస్తూ సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేస్తూ పెట్రోలింగ్ ద్వారా అక్రమ రవాణా మద్యాన్ని అరికట్టేందుకు సరిహద్దు ఏరియాలో ఎప్పటికప్పుడు పరిశీలనలో ఉంటున్నట్లు వారికి తెలిపారు. నిత్యం పరిరక్షణలో ఉంటూ తమ బాధ్యతలు నెరవేస్తున్నట్లు వారు తెలిపారు.

డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు రాంబాబు

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులను అగౌరవంగా మాట్లాడిన డ్రైవర్ వెంకటన్నపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపోగు రాంబాబు అన్నారు. అదేవిధంగా బస్సులో ప్రయాణించే ఇతర ప్రయాణికులను సైతం పరుష పదజాలంతో మాట్లాడడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్టీసీ డీఎం మంజులకు పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిత్యం ఆర్టీసీ బస్సు గద్వాల డిపో నుంచి వావిలాల మీదుగా శాంతినగర్‌కు వెళుతుందని.. ఈ క్రమంలో డ్యూటీలో డ్రైవర్ వెంకటన్న ఉన్నప్పుడు ప్రయాణికులపై అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ప్రయాణికులు తమకు విన్నవిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా ప్రయాణికులను సైతం అగౌరవంగా మాట్లాడుతున్నారని తెలిపారు. గతంలో ఆర్టీసీ డీఎంకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. డ్రైవర్ వెంకటన్న డ్యూటీలో ఉన్నప్పుడు ప్రయాణికులు బస్సులో ప్రయాణం చేయాలంటేనే భయాం దోళనలకు గురవుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ఆర్టీసీ ఎండీ. సజ్జనా ర్‌కు కూడా ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులపై అమర్యాదకంగా ఉన్న డ్రైవర్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డీఎంకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఉపా ధ్యక్షులు మణికుమార్, గద్వాల నియోజకవర్గ ఉపాధ్యక్షులు సవరన్న తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద సమస్యలను పరిష్కరించరా..?

- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్



నవతెలంగాణ - వనపర్తి

డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి వదిలేశారు. వాటిల్లో నివాసం ఉండే సామాన్యులకు సౌకర్యాలను కల్పించడంలో, సమస్యలను పరిష్కరించడంలో ఎన్నిసార్లని అధికారులకు విన్నవించాలని, ఇక వాటిని పరిష్కరించరా అని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్దనున్న స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడ సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు కట్టి వదిలేశారు.. సౌకర్యాలను మర్చిపోయారు. వర్షాకాలంలో పడే ఇబ్బందులపై అధికారులకు ఇప్పటికే వివరించామని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలు తీర్చడం లేదని, మున్సిపాలిటీ నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తుందన్నారు. పలుసార్లు పలు డిమాండ్లతో వినతి పత్రాలు ఇచ్చిన కూడా ఎలాంటి సౌకర్యాలు కల్పించలేక పోతున్నారన్నారు. అక్కడున్న సమస్యల ప్రధానమైనవి రోడ్లు, మంచినీటి సౌకర్యం, వీధిలైట్లు, శానిటేషన్ ఇవి ఏమీ లేకుండా ఇల్లు మాత్రం ఇచ్చి ఉండమంటే ఎలా ఉంటారని ప్రశ్నించారు. మున్సిపాలిటీ నుండి ఫ్రైడే డ్రై డే అంటూ కార్యక్రమాలు చేస్తున్నారని, కానీ డబల్ బెడ్ రూమ్ ల పక్కల నీళ్ల మడుగులు ఉన్నాయని, వాటిని కూడా డ్రై చేయాలన్నారు. కొత్త పాలకవర్గాలు డబుల్ బెడ్ రూమ్ పై దృష్టి పెట్టాలని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించకుంటే ధర్నాలు బందులు ప్రకటిస్తామని అఖిలపక్ష ఐక్యవేదిక హెచ్చరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ మానిటరింగ్ సభ్యులు గంధం నాగరాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, దళిత సంఘం రాష్ట్ర నాయకులు గంధం సుమన్, సిపిఎం రాష్ట్ర నాయకులు రాజు, బొడ్డుపల్లి సతీష్, సిపిఐ నాయకులు, డబల్ బెడ్ రూమ్ లో నివాసముండే ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఒకే గొడుగు కింద ఉన్నోళ్లం కలిసి పనిచేద్దాం

- మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, లక్కాకుల సతీష్



నవతెలంగాణ - వనపర్తి రూరల్

ఒకే గొడుగు కింద ఉన్న వాళ్ళం కలిసిమెలిసి పని చేసుకుంటే బాగుంటుందని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, లక్కాకుల సతీష్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ని నంది హిల్స్ లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభలో ఆయన సమక్షంలో వనపర్తి లో కాంగ్రెస్ పార్టీలో జైన్ అయ్యానని తెలిపారు ఒకే పార్టీలో ఉంటూ ఒకే మనసులు కలవకుండా చెరోదారిలో వెళ్లకుండా గతంలో చిన్నారెడ్డి 53 వేల ఓట్లతో ఓడిపోవడం జరిగిందని అప్పటి పరిస్థితిలో బ్రహ్మాచారి ఇంట్లో నాలుగు గంటలసేపు చర్చించి నియోజకవర్గం గురించి చర్చించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీకి కొత్త వ్యక్తి కావాలని కోరుకుంటున్నారని ఆయన దృష్టికి తీసుకురావడం జరిగిందని దానికి చిన్నారెడ్డి ఒప్పుకొని కొత్తవారికి అవకాశం తప్పకుండా ఇద్దామని అలాంటి వారిని తీసుకురమ్మని చెప్పడం జరిగిందని, ఆ సమయంలో రాజకీ యాలకు దూరంగా ఉండే మేఘారెడ్డిని తీసుకురావడం జరిగిందని అలాంటి వ్యక్తి పైన మీరు అవార్కులు చివాకులు మాట్లాడడం సరైన పద్ధతి కాదని అన్నారు మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ మాట్లాడుతూ మేఘారెడ్డికి అధిష్టానం మేరకు.. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం జరిగిందని మెగా రెడ్డికి అవకాశం ఇవ్వడం ద్వారా భారీ మెజార్టీతో గెలిపించుకోవడం జరిగిందని పార్టీ అధిష్టానం మొదట చిన్నారెడ్డి పేరు ప్రస్తావించినప్పటికీ సర్వే ప్రకారం మేఘారెడ్డికి అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఉంటూ మెగారెడ్డి పై నిందలు వేయడం సరైనది కాదని అన్నారు. నేను పెద్దోడిని మీరు చిన్నోళ్ళ అని మీ నోటితో వచ్చిన మాటలే కదా చిన్నవాడికి అవకాశం ఇచ్చి చూడాలి కదా అని అన్నారు. అందరిని కలుపుకుంటూ అభివృద్ధి పైన దృష్టి ఉంచారని చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో మమ్మల్ని కలిసిపోతున్నారని గతంలో మెగా రెడ్డి మా పార్టీలోని విషయాలు ఏమైనా ఉంటే మేము కలిసి మాట్లాడు కుంటాం మా పార్టీ విషయాన్ని మీకెందుకు మా కుటుంబ విషయాల మీకెందుకు అని ఎన్నోసార్లు చెప్పడం జరిగిందని ప్రోటోకాల్ ప్రకారం చిన్నారెడ్డిని మేము గౌరవించుకుంటాం అని అన్నారని తెలిపారు . ప్రజలతో ఎన్నుకోబడిన నాయకుని చిన్నారెడ్డి పక్క పార్టీ ల నాయకుల మాటలు విని పార్టీ నీ తప్పు త్రోవ పట్టి ఇవ్వకండి అన్నారు. రెండు చేతులు జోడించి అడుగుతున్న వనపర్తి నియోజకవర్గంని ఇలా అభివృద్ధి చేసుకోవాలనే విషయంపై పోటీ పడాలని పక్క పార్టీ వాళ్ళ మాటలు వింటూ అభివృద్ధి జరగకుండా మేఘారెడ్డిని కించపరిచే విధంగా మాట్లాడితే ఊరుకునేది లేదని అన్నారు. మెగా రెడ్డి గ్రాఫ్ పడిపోవాలని ఉద్దేశంతో రాత్రి సమయంలో వేరొక నాయకులతో మాట్లాడు కుంటున్నారేమో నని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ జిల్లా అధ్యక్షునిగా అందరిని కలుపుకొని పోవాలి కానీ ఒక టీఆర్ఎస్ మీటింగ్ కు అటెండ్ కావడం సరైనది కాదని అన్నారు. కృష్ణ నాయక్ ను మేము ఒకటే విషయం అడుగుతున్నాం మీరు కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హత మీకు ఎక్కడ ఉన్నది మీరు మా పార్టీ గురించి మాట్లాడుకోవడం సరైనది కాదని, మీ పార్టీపై ఏమైనా విషయాలు ఉంటే మాట్లాడుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల గురించి మీకెందుకు మీరేమైనా కాంగ్రెస్ పార్టీలో చేరారా అని ప్రశ్నించారు. గత కొన్ని రోజుల క్రితం చిన్నారెడ్డిని పొగిడారని తర్వాత రోజే నిరంజన్ రెడ్డితో శాలువా కప్పించుకున్నారని అన్నారు. ఒక రోజు చిన్నారెడ్డి తో మరొక రోజు నిరంజన్ రెడ్డితో శాలువా కప్పించుకోవడం సరైన పద్ధతి కాదని , రాజకీయం అనేది ఎంతో హుందాతనంగా ఉండాలని , ఆ విధంగా ఉంటేనే సమాజంలో గౌరవ మర్యాదలు ఉంటాయని అన్నారు. ఒక జిల్లా నాయకు డై ఉండి ఎంపీపీ కృష్ణ నాయక్ ను సన్మానం చేయడం సరైనది కాదని , జిల్లా అధ్యక్షునిగా జిల్లా మొత్తం అన్ని తిరిగి అన్నిటిని సరి చేయాల్సిన బాధ్యత నీ పైన ఉందని , ఈ విధంగా చేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. మీరు గ్రూపు రాజకీయాలకు తెర లేపుతున్నారా 10 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ కొరకు వేయి పగలనకా కష్టపడి పని చేశామని నేడు అధికారంలోకి వచ్చాక

ఈ విధంగా గ్రూపు రాజకీయాలు చేసుకోవడం కాంగ్రెస్ పార్టీని నాశనం చేయొద్దని కోరారు. నేడు కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులై ఎంతోమంది వస్తున్నారని, ఆ విధంగానే మెగా రెడ్డి ఆకర్షితులై అధిష్టానం మేరకే ఆయన వచ్చారని లక్ష 7వేల మెజార్టీతో గెలుపొందారని అన్నారు. మీరు సొంత లాభం కొరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కన్ఫ్యూజ్ చేయవద్దని అన్నారు. అపోజిషన్ ఎంపీపీని మంత్రి రాజా నరసింహ దగ్గరికి తీసుకువెళ్లాలని అన్నారు కదా అలాంటిది స్థానికంగా ఉండే ఎమ్మె ల్యేను ఎందుకు కలవలేక పోతున్నారని ప్రశ్నించారు. బాధ్యతలు చేపట్టిన మీరు హుందాగా ఉండాలని ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు

చేయవద్దని అందర్నీ కలుపుకొని పోవాలని సూచించారు. 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, పార్టీలో ఏమన్నా సమస్యలు ఉంటే అధి ష్టానం ఉంది చర్చించుకుని సమస్యను పరిష్కారం చేసుకోవాలన్నారు . ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్స్ బి వెంకటేశ్వర్లు సత్యం సుమిత్ర యాదగిరి, జయసుధ, మధు గౌడ్ ,లక్ష్మీ రవి యాదవ్, నక్క రాములు ,జంపన్న ,సత్య మ్మ శర వందా, చంద్రమౌళి ,మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు ,వెంకటేష్ ,ముంబై మన్యం, సీతారాములు, అంజి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ - గట్టు

మండలంలోని మాచర్ల గ్రామంలో లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలోని అమావాస్య సందర్భంగా దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నం 2 గం టలకు దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

నాయకులు, కార్యకర్తకు కృతజ్ఞతలు

- మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్



నవ తెలంగాణ - గట్టు

నా స్వంత గ్రామమైన చాగదోణ, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు, నాయకులకు, కార్యక్తలకు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గత రెండు దశాబ్దాల నా సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో 2014 ఎన్నికల్లో అంతంపల్లి, చిన్నోనిపల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజలు నన్ను ఎంపీటీసీగా గెలిపించడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నన్ను వైస్ ఎంపీపీగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 2019 ఎంపీటీసీ ఎన్నికల్లో పై మూడు గ్రామాల ప్రజలు నాపై నమ్మకంతో ఓట్లు వేసి నన్ను మరోసారి ఎంపీటీసీగా ఎన్నుకొని రాజకీయంగా మరో మె ట్టును ఎక్కిస్తే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నన్ను మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వానికి ప్ర జలకు వారధిగా ఎమ్మెల్యే సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గట్టు మండల ప్రజల ఆదరణను పొందానని తెలిపారు. ఈ ఐదేండ్లలో నాకు ఒకవైపు జన శ్రేయస్సు కోసం చేపట్టిన కార్యక్రమాల వల్ల ప్రజల మన్ననలు పొందడంతో పాటు అవే మంచి పనుల వల్ల లభించిన ఆదరణ నన్ను ప్రత్యర్థి పార్టీల నాయకుల నుంచి అనేక ఆటుపోట్లను గురిచేసిందన్నారు. ప్రజలు ఇచ్చిన ఎంపీపీ పదవీ కాలం ముగిస్తున్నది.... సాధారణ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన నాకు ఈ ఐదు సంవత్సరాల కాలం ఎంపీపీగా అటు ప్రభుత్వ వర్గాల్లోనూ ఇటు సాధారణ ప్రజల్లోనూ ప్రత్యేక గుర్తింపును అందించడానికి ప్రత్య క్షంగా, పరోక్షంగా కారణమైన గట్టు గ్రామాల ప్రజలకు గద్వాల నియోజకవర్గ ప్రజలకు ఇకముందు కూడా ఎల్లవేళలా సేవకుడిగా పని చేయడానికి సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. అధికారం ఉన్నంత మాత్రాన ఎవరూ గొప్పవారు కాలేరని, దానిని వినియోగించే పద్ధతిని బట్టి గొప్పవారవుతారనే సిద్ధాంతాన్ని ఎల్లవేళలా మననం చేసుకుంటూ మీ అందరి ప్రేమాభిమానాలు భవిష్యత్‌లో కొనసాగి మరింత ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు సహాయ, సహకారాలు అందజేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

బస్సు పాస్ కౌంటర్ కొనసాగించాలి

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

నవతెలంగాణ - అలంపూర్

అలంపూర్ చౌరస్తాలో ఉన్న బస్సు పాస్ కౌంటర్‌ను యధావిధిగా కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సు పాస్ కౌంటర్ గత కొంతకాలంగా తెరవడం లేదని తెలిపారు. కౌంటర్ ను తెరవాలని ఆర్టీసీ డీఎం కు ఫోన్ ద్వారా కోరారు. ఇందుకు స్పందించిన డీఎం మాట్లాడుతూ కౌంటర్లో ఆర్టీసీ కి సంబంధించిన ఒక మెకానిక్ ను ఏర్పాటు చేశామని, అతనికి పాసులకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పిస్తే గద్వాలకు తెచ్చి పాసులు తెచ్చిస్తారని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అమ్మాయిలకు ఉచిత బస్సు సౌకర్యం ఉందని, పాసులు ఇచ్చే కౌంటరునే తీసివేయడం సరికాదని అలంపూరు చౌరస్తా నుంచి లింగనవాయి, కోనేరు, బుక్కపురం, గుందిమల్ల, తదితర గ్రామాల నుంచి అలంపూర్ వరకు కళాశాలకు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు నడుపుతున్నదని, బస్సు పాసులు ఇచ్చే కౌంటర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలంపూర్ చౌరస్తాలో ఉన్న ఇంటర్ డిగ్రీ కళాశాలలకు అలంపూరు, ఉండవెల్లి, మానవపాడు మండలాల నుంచి విద్యార్థులు వస్తున్నారని వారికి బస్సు పాసులు సరైన సమయంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వికలాంగులు బస్సు పాస్ రెన్యూవల్ చేసుకోవాలన్న గద్వాలకే పోవాల్సిన పరిస్థితి వచ్చిందని, తక్షణం అలంపూర్ చౌరస్తాలో పాసులు ఇచ్చేందుకుగాను కౌంటర్ యధావిధిగా కొనసాగించాలని, లేనియెడల విద్యార్థులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీలోకి ..
గద్వాల ఎమ్మెల్యేకు స్వాగతం

- యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ, శీను



నవతెలంగాణ - గట్టు

హైదరాబాద్ గాంధీ భవన్ లో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సరిత తిరుపతయ్య కు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఇస్తూ శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్ లో వేలాది మంది కార్యకర్తలతో గాంధీభవన్ వద్ద చేరుకున్నారు. అయితే గత కొన్ని రోజులుగా కృష్ణ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాడని నినాదాలు ఎక్కువయ్యాయి.. అది నిజమే అధిష్టానం కూడా ఆయనను ఆహ్వానించి నేడు లేదా రేపు ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి సమావేశంలో ఆయనను ఆహ్వానించనున్నట్లు నాయకులు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎంతోమంది కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేయడం జరిగిందని, వాళ్లని తమ కార్యకర్తలుగా భావించి తమ దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.